# వరంగల్ వాయిస్
Evening Daily

సంపుటి : 04 | సంచిక : 31
పేజీలు : 08 | వెల: రూ.5/-

మంగళవారం
అక్టోబర్ 15, 2024

www.epaper.warangalvoice.net | www.warangalvoice.net




8లో..

## సిబ్బంది సమస్యలు పరిష్కరిస్తాం..

- కమిషనరేట్‌లో ప్రత్యేక విభాగం ఏర్పాటు
- ప్రతి శనివారం అందుబాటులో సీపీ
- వరంగల్ పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝూ

# ఇచ్చుకో.. చేసుకో?

- గ్రామాల్లో గుడుంబా గుబాలింపు
- భారీగా వసూళ్ల పర్వం
- మామూళ్ల మత్తులో అధికారులు
- సీసాలు పట్టుకొని బస్తాలు వదిలేస్తున్న వైనం
- తండాలో పుట్టగొడుగుల్లా సారా బట్టీలు
- క్యాష్ చేసుకుంటున్న బెల్లం వ్యాపారులు
- గుడుంబా లీటర్ కు రూ. 500
- రోడ్డున పడుతున్న కుటుంబాలు



8లో..



# అంతా రెడ్లే

వివరాలు2లో..

- ఓరుగల్లులో నామినేటెడ్ పదవులూ వారికే
- పోలీస్, రెవెన్యూ శాఖల్లోనూ వారి మాటే కీలకం
- రేవంత్ రెడ్డి రాకతో మారిన రాజకీయ స్వరూపం
- బీసీ నేతల అష్టదిగ్బంధం
- కార్యకర్తలుగానే మిగిలిపోతున్న ఇతరులు
- అందుకే బలపడుతున్న బీసీ ఉద్యమం

ఓరుగల్లులో 'రెడ్ల' పెత్తనం ఎక్కువైంది. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చి రేవంత్ రెడ్డి ముఖ్యమంత్రి అయ్యాక రాష్ట్రంలో రాజకీయ స్వరూపమే మారిపోయింది. అర్హత, సమర్థతను పక్కనబెట్టి పేరు పక్కన రెడ్డి అని ఉంటే చాలు పిలిచి రెడ్ కార్పెట్ పరువడం ఆనవాయితీగా మారింది. నామినేటెడ్ పదవుల్లో 90శాతం పదవులు వారికే దక్కడం ఇందుకు నిదర్శనంగా నిలుస్తోంది. ఇదే ఆనవాయితీ జిల్లాల్లోనూ కొనసాగిస్తున్నారు. పోలీస్, రెవెన్యూ శాఖల్లోనూ వారి హవానే కొనసాగిస్తున్నారు. ఆడింది ఆటగా..పాడింది పాటగా సాగుతోంది వారి వ్యవహారం. ఇదే క్రమంలో స్వయం కృషితో ఎదిగిన బీసీ నేతలను అష్టదిగ్బంధం చేస్తూ వారి అభివృద్ధికి అడ్డు కట్టగా నిలుస్తున్నారు. బీసీ నేతల మధ్య చిచ్చు పెట్టి వారి భుజాలపైనే గన్ను పెట్టి వారినే కాల్చుతున్నారు. దీంతో జీవితకాలం పార్టీ కోసం కష్టపడినా బీసీలు కార్యకర్తలుగానే మిగిలిపోతున్నారు. ఈ నిర్బంధం నుంచే బీసీ ఉద్యమం పుట్టుకొచ్చింది. ఇప్పుడిప్పుడే వారిలో చైతన్యం కట్టలు తెంచుకొంటుంది. జనాభా దామాషా ప్రకారం పదవులకోసం పట్టుపడుతున్నారు. రానున్న రోజుల్లో బీసీ ఉద్యమం మరింత బలపడడం ఖాయం. -వరంగల్ వాయిస్, వరంగల్ ప్రతినిధి



2లో..

## రామప్ప ఖ్యాతిని.. ప్రపంచానికి చాటి చెప్పాలి

వారసత్వ సంరక్షణకు స్వచ్ఛందంగా సేవ చేయాలి

ములుగు కలెక్టర్ దివాకర టీఎస్

వరల్డ్ హెరిటేజ్ వాలంటీర్స్-2024 కార్యక్రమం ప్రారంభం

- డీలర్లపై క్రిమినల్ కేసులు
- ప్రజలకు మెరుగైన సేవలందించాలి
- జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారదా



8లో..

## ఏడు రేషన్ షాపుల సీజ్

# అంతా రెడ్లే

- నామినేటెడ్ పదవులూ వారికే
- పోలీస్, రెవెన్యూ శాఖల్లోనూ
- వారి మాటే కీలకం
- రేవంత్ రెడ్డి రాకతో మారిన రాజకీయ స్వరూపం
- బీసీ నేతల అష్టదిగ్బంధం
- కార్యకర్తలుగానే మిగిలిపోతున్న ఇతరులు
- అందుకే బలపడుతున్న బీసీ ఉద్యమం



**వరంగల్ వాయిస్, వరంగల్ ప్రతినిధి :** ముఖ్యమంత్రిగా రేవంత్ రెడ్డి బాధ్యతలు చేపట్టిన తర్వాత రాష్ట్రంలో రాజకీయ స్వరూపమే మారిపోయింది. గతంలో కేసీఆర్ హయాంలో ఒకే కుటుంబానికి కొలువులు దక్కితే రాష్ట్రంలో కొత్తగా కొలువుదీరిన రేవంత్ రెడ్డి సర్కార్ లో గంప గుత్తగా ఒకే కులానికి చెందిన వారికి పదవులు దక్కుతున్నాయి. బహుజనులపై ప్రేమ ఉన్నట్లు నటిస్తునే లోలోపల తమ కుల జాడ్యాన్ని ప్రదర్శిస్తున్నారన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. నామినేటెడ్ పదవుల్లోనూ 90శాతానికి పైగా రెడ్డి సామాజిక వర్గానికి చెందిన వారికే దక్కడాన్ని ఈ సందర్భంగా ఉటంకిస్తున్నారు. దీంతో రాష్ట్రంలో అత్యధిక జనాభా కలిగిన బడుగు, బలహీన, మైనార్టీ వర్గాలకు ఎక్కడా ప్రానితధ్యం లేకుండా పోతోందన్న ఆవేదన వ్యక్తమవుతోంది.

### ఓరుగల్లులోనూ..

ఓరుగల్లులో రెడ్ల పెత్తనం ఎక్కువైంది. అన్ని కీలక శాఖల్లోనూ వారి హవానే కొనసాగుతోంది. ఉమ్మడి వరంగల్ జిల్లాలోని రిజర్వడ్ ఎమ్మెల్యే స్థానాలు మినహా మిగిళిన అన్ని ప్రాంతాల్లో వారే ఎమ్మెల్యేలుగా గెలుపొందడంతో వారి కనుసన్నల్లోనే పాలన సాగుతోంది. నామినేటెడ్ పదవుల్లోనూ రెడ్డి సామాజిక వర్గం వారే చైర్మన్లుగా నియమితులు కావడంతో ప్రతి పనిలో వారి మార్క్ కనిస్తోంది. వారి సామాజిక వర్గానికి చెందిన వారికే ఎమ్మెల్సీ పదవులు సైతం కట్టబెట్టడంతో సామాన్యుడి పరిస్థితి అగమ్య గోచరంగా మారింది. పోలీస్, రెవెన్యూ శాఖల్లో వారు ఆడింది ఆట..పాడింది పాటగా సాగుతోంది. పవర్ లో ఉన్న రెడ్లు చెబితేనే పోస్టింగులు రావడం సర్వసాధారణంగా మారింది. పైకి వారు వేరు వేరుగా కనిపించినా లోపల మాత్రం వారంతా ఒక్కటిగానే చక్రం తిప్పుతున్నారు.

### రెచ్చగొట్టి..

ప్రతి పార్టీకి కార్యకర్తలే కీలకం. వారు రేయింబవళ్లు కష్టపడి కాంగ్రెస్ పార్టీని అధికారంలోకి తీసుకువస్తే నేడు వారిని పట్టించుకునే వారే కరువయ్యారు. కార్యకర్తలకోసం ప్రాణం ఇస్తామంటూ బయలు దేరిన మంత్రి కొండా సురేఖపై రెడ్డి వర్గీయులు బురదజల్లే ప్రయత్నం చేస్తున్నారు. స్వయం కృషితో ప్రజలే తన దేవుళ్లుగా భావిస్తూ వారి అభివృద్ధి కోసం అహర్నిశలు కృషి చేస్తున్న మంత్రిని అష్టదిగ్బంధం చేస్తున్నారు. సౌమ్యురాలిగా గుర్తింపు పొందిన సురేఖను కావాలని రెచ్చగొట్టి ఆమెను అబాసు పాలు చేసేందుకు ప్రయత్నిస్తున్నారు. బీసీ నేతల మధ్య చిచ్చు పెట్టి వారి భుజంపైనే గన్ను పెట్టి సురేఖను కాల్చేందుకు పథకం పన్నుతున్నారు. అందులో భాగంగానే బడుగు, బలహీన వర్గాలకు చెందిన ఎమ్మెల్యేలతో రెడ్డి ఎమ్మెల్యేలు, పార్టీ జిల్లా అధ్యక్షురాలితో రహస్య సమావేశం నిర్వహించారు. సురేఖకు వ్యతిరేకంగా అధిష్ఠానానికి ఫిర్యాదు చేసేందుకు సిద్ధపడుతున్నారు.



### పుంజుకుంటున్న బీసీ ఉద్యమం..

రాష్ట్రంలో అత్యధిక జనాభా కలిగిన బడుగు, బలహీన, మైనార్టీ వర్గాలకు ఎక్కడా ప్రానితధ్యం లేకుండా పోతోంది. వారు కేవలం పార్టీ కార్యకర్తలకే పరిమితం కావడాన్ని జీర్ణించుకోలేక పోతున్నారు. ఇంతకాలం ఉన్న నిర్బంధాలను తెంచుకుంటూ ఉద్యమ బాట పడుతున్నారు. మా పదవులు మాకు కావాలంటూ నినదిస్తున్నారు. రోజు రోజుకూ బీసీ ఉద్యమం తీవ్ర రూపం దాల్చుతోంది.




# రామప్ప ఖ్యాతిని.. ప్రపంచానికి చాటి చెప్పాలి

- వారసత్వ సంరక్షణకు స్వచ్ఛందంగా సేవ చేయాలి
- ములుగు కలెక్టర్ దివాకర టీఎస్
- వరల్డ్ హెరిటేజ్ వాలంటీర్స్-2024 కార్యక్రమం ప్రారంభం

**వరంగల్ వాయిస్, వెంకటాపూర్ :** రామప్ప ఖ్యాతిని ప్రపంచానికి చాటి చెప్పాలని, ప్రపంచ వారసత్వ సంరక్షణ కోసం స్వచ్ఛందంగా ప్రతి ఒక్కరూ సేవ చేయాలని జిల్లా కలెక్టర్ దివాకర టీఎస్ అన్నారు. మంగళవారం వెంకటాపూర్ మండలం పాలంపేటలోని ప్రపంచ ప్రఖ్యాతిగాంచిన యునెస్కో వరల్డ్ హెరిటేజ్ సైట్ రామప్పలో మూడో వరల్డ్ హెరిటేజ్ వాలంటీర్–2024 ట్రైనింగ్ ప్రోగ్రామ్, యువ టూరిజం క్లబ్ ట్రైనింగ్ ప్రోగ్రామ్–2024 ను జిల్లా కలెక్టర్ మంగళవారం జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ వరల్డ్ హెరిటేజ్ వాలంటీర్స్–2024 వర్కింగ్ ఆన్ ది ఫ్యూచర్' అనే థీమ్‌తో వరల్డ్ హెరిటేజ్ వాలంటీర్స్–2024 ను నుంచి ఈ నెల 15 నుంచి 26 వరకు నిర్వహించనున్నట్లు ఆయన ప్రకటించారు. ప్రపంచ వారసత్వ సంరక్షణ కోసం స్వచ్ఛందంగా సేవ చేయడం ఒక ప్రత్యేకమైన అనుభవం అన్నారు. మాతో చేరండి అనే నినాదంతో వరల్డ్ హెరిటేజ్ వాలంటీర్స్ ముందుకు సాగాలన్నారు. ఈ కార్యక్రమం కాకతీయ హెరిటేజ్ ట్రస్ట్ నిర్వహిస్తున్నదనీ, 40 మంది వాలంటీర్స్ దేశంలోని వివిధ రాష్ట్రాల నుంచి యువ టూరిజం క్లబ్స్ తెలంగాణ స్టేట్ లోని వివిధ కాలేజీల నుంచి 40 మిద్యార్థులు మొత్తం 80 మంది వాలంటీర్స్ పాల్గొనడం జరుతుందన్నారు. చరిత్ర, సాంస్కృతి, సాంప్రదాయాలు, పర్యాటకం, కాకతీయుల చరిత్ర, కాకతీయుల కట్టడాలు, టెక్నాలజీ ఇతర అంశాలపై లెక్చర్స్, ఫీల్డ్ ట్రిప్స్ ఉంటాయన్నారు. ట్రైనింగ్ అనేది ప్రతి ఒక్కరికి చాలా ముఖ్యమైనదని, ట్రైనింగ్ లో దేశంలోని వివిధ యూనివర్సిటీల ప్రొఫెసర్ ద్వారా వివిధ సబ్జెక్టుల మీద క్లాసు నిర్వహించడం, ఫీల్డ్ ట్రిప్ లో కూడా చరిత్ర సాంస్కృతి సంప్రదాయాలు టెక్నాలజీ గురించి తెలయజేస్తారన్నారు. ప్రొఫెసర్ పాండురంగారావు మాట్లాడుతూ కాకతీయ హెరిటేజ్ ట్రస్ట్ రామప్పని యునెస్కో తీసుకురావడానికి ఏ విధమైన ప్రయత్నాలు జరిగినదని విశధీకరించారు. కాకతీయ హెరిటేజ్ ట్రస్ట్ మెంబర్ శ్రీధర్ రావు మాట్లాడుతూ కాకతీయ హెరిటేజ్ ట్రస్ట్ పుట్టుక దాని విధివిధానాలు పని విధానం ఏ విధమైన పనులు చేశారు అనే దానిమీద వివరించారు. జిల్లా టూరిజం అధికారి శివాజీ మాట్లాడుతూ యువ టూరిజం క్లబ్స్ ద్వారా స్టూడెంట్స్ కి పర్యాటక రంగం మీద ఎక్కువ ఆసక్తి కలుగుతూ వివిధ ప్రదర్శనలు ఇవ్వడం వలన విజ్ఞానం పొందవచ్చన్నారు. ఈ కార్యక్రమంలో ములుగు డిగ్రీ కాలేజ్ హిస్టరీ లెక్చరర్ లత, ఎంపీడీవో వెంకటాపూర్ రాజు, యోగ టీచర్ యోగి రాంబాబు, రామప్ప దేవాలయ టూరిస్ట్ గైడ్స్ విజయ్, వెంకటేష్, కేంద్ర పురావస్తు శాఖ సిబ్బంది, దేవాదాయ శాఖ సిబ్బంది, పర్యాటక అభివృద్ధి సంస్థ సిబ్బంది శ్రావణ్, రంజిత్, దేశంలోని నలుమూల నుంచి వచ్చిన వాలంటీర్స్, హైదరాబాద్ సిటీ కాలేజ్ స్టూడెంట్స్, వరంగల్ పింగిలి మహిళా కాలేజీ స్టూడెంట్స్, కాకతీయ యూనివర్సిటీలో ఇస్త్రీ స్టూడెంట్స్, టూరిజం స్టూడెంట్స్, కాకతీయ యూనివర్సిటీలోని జియాలజి స్టూడెంట్స్, ములుగు డిగ్రీ కాలేజ్ స్టూడెంట్స్, తమిళనాడు నుంచి ఆర్కిటెక్చర్ ఇంజనీరింగ్ స్టూడెంట్స్, హైదరాబాద్ జేఎన్టీయూ ఆర్కిటెక్చర్ ఇంజనీరింగ్ స్టూడెంట్స్ పాల్గొన్నారు.

# పరకాలలో ఏబీసీ సెంటర్ ఏర్పాటు

## హనుమకొండ జిల్లా కలెక్టర్ ప్రావీణ్య

**వరంగల్ వాయిస్, హనుమకొండ/పరకాల :** జిల్లాలో పత్తి కొనుగోలు ప్రక్రియకు సంబంధించిన అన్ని ఏర్పాట్లను పూర్తి చేయాలని హనుమకొండ జిల్లా కలెక్టర్ పి.ప్రావీణ్య అధికారులను ఆదేశించారు. మంగళవారం హనుమకొండ జిల్లా కలెక్టరేట్ లోని మినీ కాన్ఫరెన్స్ హాల్ లో జిల్లాలో పత్తి కొనుగోలు ప్రక్రియకు సంబంధించి సీసీఐ, వ్యవసాయ, మార్కెటింగ్, తూనికలు, కొలతలు, పోలీస్, రవాణా తదితర శాఖల అధికారులతో పాటు జిన్నింగ్ మిల్లుల యజమానులతో సమావేశాన్ని నిర్వహించారు. అనంతరం జిల్లా కలెక్టర్ పి.ప్రావీణ్య మాట్లాడుతూ జిల్లాలో ఈనెల మూడో వారం నుంచి పత్తి కొనుగోలు ప్రక్రియను ప్రారంభించాలన్నారు. పత్తి కొనుగోళ్లకు సంబంధించి సందేహాల నివృతి కోసం టోల్ ఫ్రీ నెంబర్ అందుబాటులో ఉండాలన్నారు. ఈ సమావేశంలో జిల్లా అదనపు కలెక్టర్ వెంకట్ రెడ్డి, జిల్లా మార్కెటింగ్ శాఖ అధికారి అనురాధ, సీసీఐ వరంగల్ మేనేజర్ జితేందర్, ఎంవీఐ వేణుగోపాల్, ఇతర శాఖల అధికారులు, జిన్నింగ్ మిల్లుల యజమానులు పాల్గొన్నారు.

### సమీకృత గురుకుల పాఠశాల భూమి పరిశీలన..

పరకాల మండలం రాజి పేట వద్ద సమీకృత గురుకుల పాఠశాల నిర్మాణం కోసం గుర్తించిన ప్రభుత్వ భూమిని జిల్లా కలెక్టర్ పి.ప్రావీణ్య మంగళవారం పరిశీలించారు. ప్రభుత్వ భూమికి సంబంధించిన వివరాలను ఆర్డీవో డాక్టర్ కె.నారాయణ, తహసిల్దార్ భాస్కర్ లను అడిగి తెలుసుకున్నారు.

### ఏబీసీ సెంటర్ ఏర్పాటు..

పరకాలలో యానిమల్ బర్త్ కంట్రోల్ (ఏబీసీ) సెంటర్ ఏర్పాటుకు చర్యలు తీసుకుంటున్నట్లు హనుమకొండ జిల్లా కలెక్టర్ పి.ప్రావీణ్య తెలిపారు. మంగళవారం పరకాలలోని ప్రభుత్వ పశు వైద్యశాలను కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ కార్యక్రమంలో పరకాల ఆర్డీవో డాక్టర్ కె.నారాయణ, తహసిల్దార్ భాస్కర్, జిల్లా పశుసంవర్ధక శాఖ ఏడి డాక్టర్ శ్రీనివాస్, పరకాల పశుసంవర్ధక శాఖ ఏడి డాక్టర్ విజయ భాస్కర్, ఇతర అధికారులు పాల్గొన్నారు.



# వంద పడకల హాస్పిటల్ పనులు త్వరగా పూర్తి చేయాలి

### జిల్లా కలెక్టర్‌కు బీజేపీ నేతల వినతి



**వరంగల్ వాయిస్, పరకాల :** పట్టణంలో నూతనంగా నిర్మిస్తున్న 100 పడకల ప్రభుత్వాసుపత్రి పనులను త్వరగా పూర్తి చేయాలని పరకాల బీజేపీ పట్టణ అధ్యక్షుడు మార్త భిక్షపతి ఆధ్వర్యంలో మంగళవారం హనుమకొండ జిల్లా కలెక్టర్ ప్రావీణ్యకు వినతిపత్రం ఇవ్వడం జరిగింది. బీజేపీ పట్టణాధ్యక్షుడు మాట్లాడుతూ గత ప్రభుత్వం ప్రారంభించిన ప్రభుత్వ హాస్పటల్ పనులు ఇప్పటివరకు పూర్తి కాలేదని, ప్రజల సౌకర్యం ఏర్పాటు చేసిన ప్రభుత్వ హాస్పటల్ ను త్వరగా పూర్తిచేసి ప్రజలకు అందుబాటులో తీసుకోవాలని కలెక్టర్ ను కోరినట్లు తెలిపారు. వివిధ రకాల జబ్బులతో బాధపడుతున్న పరకాల ప్రాంత ప్రజలు ప్రభుత్వ హాస్పటల్ లేకపోవడంతో అప్పులు చేసి ప్రైవేట్ హాస్పిటల్ లో చికిత్స తీసుకుంటున్నారని అన్నారు. ప్రభుత్వ హాస్పిటల్ పూర్తి చేస్తే ప్రజలందరికీ ఉపయోగకరంగా ఉంటుందని కలెక్టర్ ను కోరినట్లు తెలిపారు. దీనిపై జిల్లా కలెక్టర్ సానుకూలంగా స్పందించినట్లు వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో పట్టణ ప్రధాన కార్యదర్శి గాజుల నిరంజన్, ఉపాధ్యక్షుడు కుంటమల్ల గణేష్, పరకాల మాజీ మున్సిపల్ చైర్మన్ మార్త రాజభద్రయ్య, సీనియర్ నాయకులు మారేడు కొండ భాస్కరాచారి, దగ్గు విజయేందర్రావు, కోడెల లింగమూర్తి తదితరులు పాల్గొన్నారు.

## మోడల్ స్కూల్ ప్రిన్సిపల్‌గా పూర్ణ చందర్ రావు



**వరంగల్ వాయిస్, మల్హర్ :** మండలంలోని ఎడ్లపల్లి గ్రామ పంచాయతీ పరిధిలో గల మోడల్ స్కూల్ ప్రిన్సిపల్ గా పూర్ణ చందర్ రావు మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. గతంలో ఇక్కడ ప్రిన్సిపల్ గా బాధ్యతలు నిర్వర్తించిన దూడ వెంకటేష్ ఇటీవల బదిలీపై వెళ్లగా ఆయన స్థానంలో పూర్ణ చందర్ రావు బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మోడల్ స్కూల్ అభివృద్ధికి, విద్యార్థులకు నాణ్యమైన విద్య విషయంలో ప్రత్యేక శ్రద్ధ చూపిస్తామని తెలిపారు. నూతన ప్రిన్సిపల్ కు స్కూల్ సిబ్బంది, విద్యార్థులు, మండల ప్రజలు శుభాకాంక్షలు తెలిపారు.

## బెదిరింపులకు నిరసనగా మహిళ నిరసన



**వరంగల్ వాయిస్, ఖిలా వరంగల్ :** తన భర్త ఎండీ హుస్సేన్ మృతికి గూడురు శివ అనే వ్యక్తి కారణమంటూ తనకు న్యాయం చేయాలంటూ ఖిలా వరంగల్ అంబేద్కర్ విగ్రహం ఎదుట ఎండీ సంధ్యారాణి ప్రజా సంఘాల నాయకులతో కలిసి నిరసన తెలిపింది. ఖిలా వరవగల్ పడమర కోటకు చెందిన ఎస్సీ సామాజిక వర్గానికి చెందిన ఎండీ హుస్సేన్-సంధ్యారాణి దంపతులు ప్రేమ వివాహం చేసుకొని జీవిస్తున్నారు. హుస్సేన్ కూలీ పని చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. అయితే ఈ క్రమంలో 10న గూడురు శివ అనే మేస్త్రీ వద్దకు పనికి వెళ్లి అక్కడే చలనం లేకుండా పడిపోయాడు. దీంతో మేస్త్రీ గూడురు శివ హుస్సేన్ భార్య సంధ్యారాణి వద్దకు వచ్చి మీ భర్త బాగా మద్యం సేవించి రావడం లేదని చెప్పి ఆటోలో తీసుకువచ్చి ఇంటి వద్ద వదిలేసి వెళ్లాడు. తర్వాత హుస్సేన్ లేపడానికి ప్రయ్నతించగా ఎంతకు లేవకపోవడంతో అనుమానం వచ్చి స్థానికుల సాయంతో ఎంజీఎంకు తీసుకెళ్లడంతో పరీక్షించిన వైద్యులు గంట క్రితమే హుస్సేన్ మరణించినట్లు తెలిపారు. దీంతో వెంటనే స్థానిక మిల్స్ కాలనీ పోలీస్ స్టేషన్ లో బాధిత మహిళ ఫిర్యాదు చేశారు. కేసు పెట్టినప్పటి నుంచి తమ కుటుంబంపై గూడూరు శివ బెదిరింపులకు పాల్పడుతున్నారని సంధ్యారాణి చెబుతున్నారు. కాంగ్రెస్ పార్టీకి చెందిన ఒక దళిత నాయకుడు, బీజేపీ పార్టీకి చెందిన మరోక దళిత నాయకుడు కేసు వెనక్కి తీసుకోమని ఒత్తిడి చేస్తున్నట్లు ఆరోపిస్తున్నారు. గూడూరు శివ అనే వ్యక్తి రాజకీయ అండదండలతో తమను భయాందోళనకు గురి చేస్తున్నారని అతనిపై వరంగల్ సీపీ విచారణ జరిపి కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు.

# తెలంగాణలో బీజేపీ బలోపేతమే లక్ష్యం

### బీజేపీ వరంగల్ జిల్లా అధ్యక్షులు గంట రవికుమార్

**వరంగల్ వాయిస్, ఐనవోలు :** వరంగల్ జిల్లా ఐనవోలు మండలం, పంథిని గ్రామం, పర్వతగిరి మండల కేంద్రంలో 262వ బూత్ లో, చింత నెక్కొండ 246వ బూత్ పరిధిలో తెలంగాణలో బీజేపీని బలోపేతం చేసే లక్ష్యంతో సాగుతున్న సభ్యత్వ నమోదు కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా గంట రవికుమార్ మాట్లాడుతూ ప్రధాని నరేంద్ర మోడీ దేశానికి ప్రధాన సేవకుడు. దేశంలోని నూట నలభై కోట్ల ప్రజలకు నేతృత్వం వహిస్తున్నారని, విధి నిర్వహణ కోసం పగలనక రాత్రనక ప్రధాని పని చేస్తున్నారు. ప్రధాని నరేంద్ర మోడీ మనందరికీ ఆదర్శం. పార్టీ బలోపేతం కోసం కృషి చేస్తున్నారు. దేశ హితం కోసం పనిచేసే పార్టీ బీజేపీ అని గంట కొనియాడారు. గతంలో అధికారంలో ఉన్న పార్టీనీ, ఇప్పుడు అధికారంలో ఉన్న పార్టీని చూస్తున్నామని, రాష్ట్ర అభివృద్ధినీ కుంటుపడేలా చేస్తున్నారని మండిపడ్డారు. 2047 వరకు భారత్ అభివృద్ధి చెందిన దేశంగా చేయాలని లక్ష్యంతో ప్రధాని మోడీ పని చేస్తున్నారన్నారని జిల్లా బీజేపీ అధ్యక్షుడు గంట రవికుమార్ అన్నారు. ఎందుకోసం తెలంగాణ కావాలని కోరుకున్నమో అది నెరవేరాలంటే బీజేపీ స్థానిక ఎన్నికల్లో విజయం సాధించడం అవసరమన్నారు. ప్రధాన మంత్రి నిర్దేశించిన ప్రణాళికకు అనుగుణంగా దేశాన్ని అభివృద్ధి చెందిన దేశంగా తీర్చిదిద్దేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ఆయన అన్నారు. స్కాంగ్రేస్ ప్రభుత్వం పట్ల నిరాశతో ఉన్నందున ఉత్సహంగా బీజేపీ సభ్యులు అవుతున్నారని పేర్కొన్నారు. ప్రతి పోలింగ్ బూత్‌లో సభ్యత్వ నమోదు లక్ష్యాలు వివరించి, పార్టీ శ్రేణులు ఆ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని మార్గనిర్దేశం చేశారు. త్వరలో జరగబోయే స్థానిక సంస్థల ఎన్నికలకు సభ్యత్వ



నమోదు ప్రక్రియ ఎంతో దోహదపడుతోందని తెలిపారు. ప్రతి గ్రామానికి, ప్రతి ఇంటికి వెళ్లి అన్ని వర్గాల నుంచి సభ్యత్వాలు స్వీకరించాలని ఆదేశించారు. ప్రతి పోలింగ్ బూత్ లలో సభ్యత్వ నమోదు లక్ష్యాలను వివరించి, పార్టీ శ్రేణులు పెద్ద మొత్తంలో సభ్యత్వ నమోదు చేపట్టాలని అధిష్ఠానం నిర్ణయం తీసుకుందని మార్గనిర్దేశం చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి మల్లాడి తిరుపతిరెడ్డి, రాష్ట్ర నాయకులు ముత్తిరెడ్డి కేశవరెడ్డి, జిల్లా ఉపాధ్యక్షుడు ఏకాంతం గౌడ్, బీజేపీ నాయకులు కుడికాల శ్రీధర్, కన్నయ్య, బీజేవైఎం జిల్లా అధ్యక్షులు ఎర్రగోళ్ల భరత్ వీర్, నియోజకవర్గ శక్తికేంద్ర ఇంచార్జిలు, బూత్ అధ్యక్షులు, పలు మోర్చా నాయకులు, బీజేపీ కార్యకర్తలు పాల్గొన్నారు.

## ఉచిత సంచార వైద్య శిబిరం



**వరంగల్ వాయిస్, కరీమాబాద్ :** వరంగల్ తూర్పు నియోజకవర్గం 32వ డివిజన్ లో స్థానిక కార్పొరేటర్ పల్లం పద్మ రవి ఆధ్వర్యంలో వినాయక కాలనీలో ఉచిత సంచార వైద్య శిబిరం మెడికేర్ జనరల్ హాస్పిటల్ వారి సౌజన్యంతో ఫాదర్ కొలంబ ఇన్ స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్స్ కు చెందిన వైద్య సిబ్బందితో ఫ్యామిలీ అడాప్షన్ బై దా మెడికోస్ ద్వారా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ పల్లం పద్మ రవి మాట్లాడుతూ వాతావరణ మార్పులతో వర్షాలు కురుస్తున్నందున కీటక జనిత వ్యాధులైన మలేరియా, డెంగీ విజృంభించే అవకాశం ఉన్నందున ప్రజలందరూ పరిసరాల పరిశుభ్రత పాటించాలని, ఇంటి చుట్టూ నీరు నిల్వ ఉండకుండా చూసుకోవాలని, దోమలు పుట్టకుండా, కుట్టకుండా జాగ్రత్తలు తీసుకోవాలని కోరారు. అలాగే కాలనీలోనీ ప్రజలందరూ ఈ వైద్య శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. అదేవిధంగా ఈ కార్యక్రమాన్ని డివిజన్ లోని అన్ని కాలనీలకు, అన్ని వాడలకు నిర్వహించేలా బాధ్యత తీసుకుంటానన్నారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ తో పాటు వినాయక కాలనీకి చెందిన ముఖ్య నాయకులు సౌరం శ్రీను, చేరాలు, రాజేశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

## పెండిగ్ స్కాలర్ షిప్స్ విడుదల చేయాలి




**వరంగల్ వాయిస్, మహబూబాబాద్ :** పెండింగ్ ఉపకార వేతనాలు, ఫీజు రీయింబర్స్ మెంట్లను వెంటనే విడుదల చేయాలంటూ తెలంగాణ అఫ్లియేటెడ్ డిగ్రీ పీజీ కళాశాలల మేనేజ్ మెంట్ అసోసియేషన్ (టీపీడీపీఎంఎ) ఆధ్వర్యంలో (ఎస్ఎఫ్ఐ), (పీడీఎస్ యూ), (ఏఐఎస్ఎఫ్) విద్యార్థి సంఘాలు, ప్రైవేట్ కళాశాలల నిర్వాహకులు, విద్యార్థులు మహబూబాబాద్ జిల్లా కేంద్రంలోని మధర్ థెరిస్సా సెంటర్ లో రహదారిపై బైఠాయించి రాస్తారోకో చేపట్టారు. ప్రభుత్వానికి వ్యతిరేక నినాదాలు చేశారు. ఈ సందర్భంగా టీపీడీపీఎంఎ జిల్లా నేత డాక్టర్ డోలి సత్యనారాయణ మాట్లాడుతూ విద్యార్థులకు సంబంధించిన ఉపకార వేతనాలు ఫీజు రీయింబర్ మెంట్స్ ప్రభుత్వం వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. విద్యార్థులకు చెల్లించాల్సిన ఫీజులను ప్రభుత్వం చెల్లించడం లేదని, ప్రభుత్వ నిర్లక్ష్యంతో కళాశాలలు నిర్వహించలేని పరిస్థితి నెలకొందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం ఫీజు రేయంబర్ మెంట్స్ విడుదల చేయకపోవడంతో ప్రైవేట్ కళాశాలల మనుగడ ప్రశ్నార్థకంగా మారిందన్నారు. అధ్యాపకులు, సిబ్బంది వేతనాలకు అప్పులు చేయాల్సిన పరిస్థితులు దాపరించాయని తెచ్చిన అప్పులు తీర్చలేక అవస్థలు పడుతున్నామని వాపోయారు. బకాయిలను విడుదల చేయకపోతే ఆందోళనలు ఉధృతం చేస్తామని ప్రభుత్వాన్ని హెచ్చరించారు. ప్రైవేట్ కళాశాలల నిర్వాహకులు, విద్యార్థి సంఘాల నేతలు డాక్టర్ డోలి సత్యనారాయణ, టీపీడీపీఎంఎ జిల్లా నేత పాల్గొన్నారు.

# రూ.10 నాణేల స్వీకరణపై ఆర్బీఐ అవగాహన కార్యక్రమం

**వరంగల్ వాయిస్, వరంగల్ :** భారతీయ రిజర్వ్ బ్యాంక్ తీసుకున్న వివిధ చొరవలకు కొనసాగింపుగా, 2024 అక్టోబర్ 14, 15 న ఎంపిక చేసిన బ్యాంకుల సహకారంతో రూ.10 నాణేల స్వీకరణపై ప్రజా అవగాహన ప్రచారాన్ని ప్రారంభించింది. ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల్లో, వ్యాపారులు ముఖ్యంగా చిరు వ్యాపారులు, ప్రజలలో రూ.10 నాణేలను స్వీకరించడానికి విముఖత ఉన్నట్లు గమనించబడింది. ఈ విముఖత రాష్ట్రమంతటా వ్యాపిస్తున్న తప్పుడు సందేశాల కారణంగా తలెత్తిన అనుమానాల వల్ల ఉత్పన్నం అవుతుందని వ్యక్తమవుతోంది.ఎంపిక చేసిన బ్యాంకులు ప్రతి శాఖ కనీసం పది రిటైల్ ఖాతాదారులు, పీఎం స్వనిధి లబ్దిదారులు, చిన్న వ్యాపారాలు, కిరాణా దుకాణాలు మొదలైన వారిని సంప్రదించి వారి వారి వ్యాపార ప్రదేశంలో అవగాహన కరపత్రాలను అతికించడం, వారి సంస్థలో ప్రముఖ ప్రదేశంలో రూ.10 నాణేల చట్టపరమైన చెల్లుబాటును ధృవీకరించడంపై ఈ ప్రచారం దృష్టి పెడుతుంది. అంతేకాకుండా, ఈ రెండు రోజుల్లో బ్యాంక్ ఖాతాదారులు బ్రాంచ్ నుంచి నగదు ఉపసంహరణలో సహేతుకమైన భాగం రూ.10 నాణేల ద్వారా ఉండాలని తెలపడం జరిగింది. అలాగే అవగాహన కార్యక్రమంలో భాగంగా బ్యాంకుకు అనుబంధంగా ఉన్న క్షేత్రస్థాయి సిబ్బంది, బిజినెస్ కరస్పాండెంట్లను (బీస్లు) స్థానిక మార్కెట్లకు (రైతు బజార్లు వంటివి) మోహరించడం జరిగింది. భారతీయ రిజర్వ్ బ్యాంక్, భారత ప్రభుత్వం



ముద్రించిన నాణేలను ఎప్పటికప్పుడు చలామణిలోకి తెస్తుందని మరోసారి నొక్కి చెప్పడం జరిగింది. నాణేల జీవితకాలం ఎక్కువగా ఉండటం వల్ల, బహుళ డిజైన్లు, ఆకారాలు ఒకేసారి మార్కెట్లో చలామణి అవ్వడం గమనార్హం. ఇప్పటి వరకు భారతీయ రిజర్వ్ బ్యాంక్ వివిధ డిజైన్లలో రూ.10 నాణేలను విడుదల చేసింది. డిజైన్ తో సంబంధం లేకుండా రూ.10 నాణేలు చట్టబద్ధమైనవి, ఎటువంటి సంకోచాలు లేకుండా లావాదేవీల కోసం స్వీకరించవచ్చని పునరుద్ఘాటించబడింది. భారతీయ రిజర్వ్ బ్యాంక్ ఈ నాణేలను తమ అన్ని శాఖలలో లావాదేవీలు, మార్పిడి కోసం స్వీకరించాలని అన్ని బ్యాంకులకు తిరిగి ఆదేశాలు జారీ చేసింది.

# స్కూల్స్, హాస్టల్ పరిశుభ్రంగా ఉంచాలి

## మానుకోట కలెక్టర్ అద్వైత్ సింగ్



**వరంగల్ వాయిస్, డోర్నకల్ :** మానుకోట కలెక్టర్ అద్వైత్ కుమార్ సింగ్ కురవి మండల కేంద్రంలోని ఏకలవ్య మోడల్ రెసిడెన్షియల్ స్కూల్, ఆశ్రమ హైస్కూల్, ప్రాథమిక ఆరోగ్య కేంద్ర, బలుపాల గ్రామంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, అంగన్ వాడీ కేంద్రం, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల లను మంగళవారం ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ దసరా సెలవులు ముగిసినందున విద్యార్థిని, విద్యార్థులు పాఠశాలలకు, హాస్టళ్లకు తిరిగి వస్తున్న క్రమంలో తరగతి గదులు, హాస్టల్ రూమ్స్, డైనింగ్ హాల్స్, స్టడీ రూమ్స్, మరుగు దొడ్లు, త్రాగు నీరు, విద్యుత్ తదితర సౌకర్యాలు సిద్ధంగా ఉంచాలనీ వార్డెన్లు, ప్రిన్సిపల్ లను ఆదేశించారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలలో సీజనల్ వ్యాధులకు సంబంధించిన మందులు సిద్ధంగా ఉంచుకోవాలని, సాధారణ ప్రసవాలు ప్రోత్సహించాలని, ఇన్ పేషంట్స్, ఔట్ పేషెంట్స్, వివరాలు సేకరించి జ్వరం సర్వే నిర్వహించాలని, గ్రామ స్థాయిలో ఆశ కార్యకర్తలు, ఏఎన్ఎం లు ఇంటింటి సర్వే నిర్వహించి తగిన జాగ్రత్తలు తీసుకోవాలని ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. అంగన్వాడీ కేంద్రాల ద్వారా గర్భిణీ స్త్రీలకు, బాలింతలకు, చిన్న పిల్లలకు వారికి పౌష్టిక ఆహారం అందించాలని, విలేజ్ హెల్త్ ప్రోగ్రాం నిర్వహించి, గ్రామాల్లో ఆరోగ్యం, పరిశుభ్రత, పరిరక్షణపై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. గ్రామాల ప్రత్యేక అధికారులు ప్రతీ రోజు పాఠశాలలు, వసతి గృహాలు తనిఖీలు నిర్వహించాలని, విద్య, వైద్యం, సానిటేషన్, ఆరోగ్యం తదితర సౌకర్యాలపై ప్రతిరోజు నివేదికలు సమర్పించాలని ఆదేశించారు.

## బీజేపీలో చేరిన బత్తిని దేవేందర్ పటేల్



**వరంగల్ వాయిస్, పర్వతగిరి :** వరంగల్ జిల్లా బీజేపీ అధ్యక్షుడు గంట రవికుమార్ సమక్షంలో బీజేపీలో చేరిన చింతనెక్కొండ కాంగ్రెస్ నాయకుడు బత్తిని దేవేందర్ పటేల్ మంగళవారం బీజేపీ సభ్యత్వం తీసుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దేశ అభివృద్ధి, ప్రగతి కోసం అహర్నిశలు కృషి చేస్తున్న భారత ప్రధాని నరేంద్ర మోడీ ప్రవేశపెడుతున్న పథకాలకు ఆకర్షితులై, గ్రామ గ్రామాల్లో బీజేపీ సభ్యత్వాలు తీసుకోవడం జరుగుతుంది. సభ్యత్వ నమోదు కార్యక్రమంలో భాగంగా మంగళవారం పర్వతగిరి మండలం, చింతనెక్కొండ గ్రామం 246 బూత్ లో సభ్యత్వాలు కల్పించడం జరిగింది. ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి మల్లాడి తిరుపతిరెడ్డి, జిల్లా ఉపాధ్యక్షులు ఏకాంతం గౌడ్, బీజేపీ నాయకులు కుడికాల శ్రీధర్, ఎస్సీ మోర్చా నాయకులు బొట్ల మధు, బూత్ అధ్యక్షులు తౌడోజు సాంబయ్య,

## దీప్తి జీవాంజికి సత్కారం



**వరంగల్ వాయిస్, పర్వతగిరి :** పారీస్ పారాలింపిక్స్ 2024 కాంస్య పతక విజేత కుమారి దీప్తి జీవాంజిని తన స్వగ్రామం పర్వతగిరి మండలంలోని కల్లెడ గ్రామంలో తన స్వగృహంలో పర్వతగి మండల పరిషత్ అభివృద్ధి అధికారి మాలోత్ శంకర్ నాయక్, మండల పంచాయతీ అధికారి శ్రీపాక శ్రీనివాసులు, పంచాయతీ కార్యదర్శులు పూల బొకే, శాలువాతో సత్కరించి అభినందనలు తెలిపారు.

## పశువులకు గాలికుంటు వ్యాధి నిరోధక టీకాలు



**వరంగల్ వాయిస్, పర్వతగిరి :** మండలంలోని అనంతారం గ్రామంలో మంగళవారం పశువులకు ఉచిత గాలికుంటు వ్యాధి నిరోధక టీకాలు వేశారు. ఈ కార్యక్రమం నేటి నుంచి నవంబర్ 14 వరకు మండలంలోని ప్రతి గ్రామంలో నిర్వహించబడతుంది. పశువులలో గాలికుంటు వ్యాధి రాకుండా నిరోధించటకు ఈ టీకాలు వేయడం జరుగుతుంది. కాబట్టి, ప్రతి గ్రామంలోని పశువులకు టీకాలు వేసుకోవాలని పశు వైద్యాధికారి డాక్టర్ కె.రాజు కోరారు. నేడు అనంతారం గ్రామంలో నిర్వహించిన ఉచిత గాలికుంటు వ్యాధి నిరోధక టీకాల కార్యక్రమంలో మొత్తం తెల్ల పశువులు 15, నల్ల పశువులు 78కి ఉచిత గాలి కుంటు నిరోధక టీకాలు చేయడం జరిగిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల పశువైద్యాధి కారి డాక్టర్ కె.రాజు, జేవీఓ అమరావతి, గోపాల మిత్రులు కుమార్, లక్ష్మణ్, వెంకన్న పాల్గొనడం జరిగింది. రేపు గోపనపల్లి గ్రామంలో టీకాలు చేస్తామని పుశు వైద్యాధికారి తెలిపారు.

## యువకుడిని కాపాడిన మడికొండ పోలీసులు



**వరంగల్ వాయిస్, మడికొండ :** దుగ్గొండి మండలం మదనపల్లి గ్రామానికి చెందిన రాసమల్ల రమేష్ (27) ప్రస్తుతం హైదరాబాదులో ప్రైవేటు ఉద్యోగం చేస్తూ దసరా పండగకు ఇంటికి వచ్చాడు. ఈ సమయంలో ఇంట్లో గొడవపడి మనస్థాపం చెంది మంగళవారం ఇంట్లో నుంచి బయటకు వచ్చి సూసైడ్ నోట్ రాసుకొని, వాట్సాప్ కాల్ ద్వారా వారి ఇంటి సభ్యులకు నేను చనిపోతున్నానని తెలియచేశాడు. ఆత్మహత్య చేసుకోవడానికి ( మడికొండ) అయోధ్య పురం రైల్వే ట్రాక్ పైకి రాగా డయల్ 100 ద్వారా ఈ విషయాన్ని తెలుసుకున్న మడికొండ బ్లూ కోల్ట్స్ పోలీసులు హెడ్ కానిస్టేబుల్ రామనాథం, కానిస్టేబుల్ వాసులు యువకుడి ప్రాణాలు కాపాడారు. మడికొండ ఇన్ స్పెక్టర్ పుల్యాల కిషన్, యువకుడి కుటుంబ సభ్యులను పిలిపించి కౌన్సిలింగ్ చేసి పంపించారు.

## రాష్ట్ర స్థాయి వ్యాస రచన పోటీల్లో రాజోలు విద్యార్థుల ప్రతిభ



**వరంగల్ వాయిస్, కురవి :** తెలుగు రాష్ట్రాలలో వారధి ఫౌండేషన్ ఆధ్వర్యంలో మండల, జిల్లా, రాష్ట్ర స్థాయిలో సంరక్షణ, గృహ పనులకు గృహిణులకు వేతనం ఇవ్వాల/వద్దా అనే అంశంపై వ్యాసరచన పోటీలను ఆ సంస్థ ఫౌండర్ శ్రీ మోహన్ కంద రిటైర్డ్ సీఎస్, ఐఏఎస్ ఆధ్వర్యంలో నిర్వహించడం జరిగింది. రాష్ట్ర స్థాయిలో ఈ పోటీలను గత నెల 25న నిర్వహించి ఈ నెల అక్టోబర్ 15న విజేతలను అతిథులు క్రికెటర్ వీవీఎస్ లక్ష్మణ్, తెలంగాణ పాఠశాల విద్యా డైరెక్టర్ నరసింహా రెడ్డిలచే ప్రకటించగా జడ్పీహెచ్ఎస్ రాజోలు పదవ తరగతి విద్యార్థులైన బి. శివ, డి.అంగద్ లను రాష్ట్రస్థాయిలో ద్వితీయ విజేతలుగా ప్రకటించారు. ఇందుకు గాను నగదు బహుమతి రూ.30 వేల రూపాయలను విజేతలకు అందజేయడం జరుగుతుంది. ఈ సందర్భంగా విద్యార్థులను పాఠశాల ప్రధానోపాధ్యాయులు రవి కుమార్, సాంఘిక శాస్త్ర ఉపాధ్యాయులు, గైడ్ టీచర్ కిషన్, ఉపాధ్యాయ బృందం వెంకటరెడ్డి, దామోదర్, మోహన్, బీకు, సురేష్, రవికుమార్, రాజేశ్వరి, కాశీనాథ్, వసంత, సతీష్, కిరణ్, భవాని, ప్రభాకర్, ప్రకాష్, తోటి విద్యార్థిని, విద్యార్థులు, గ్రామ పెద్దలు అభినందించారు.

## కాంట్రాక్టర్‌పై చర్యలు తీసుకోవాలి

### ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు బొడ్డు స్మరన్



**వరంగల్ వాయిస్, కాటారం :** జయశంకర్ భూపాలపల్లి జిల్లా కాటారం మండలం చిదినేపల్లి ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల ప్రాంగణంలో గల తరగతి గది భవనాలను ఎలాంటి అనుమతులు లేకుండా కాంట్రాక్టర్ ఇష్టానుసారంగా కూల్చివేశారని, అతడిపై చర్యలు తీసుకోవాలని ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు బొడ్డు స్మరన్ డిమాండ్ చేశారు. మంగళవారం పాఠశాలను సందర్శించి అక్కడ ఉన్న గ్రామస్తులతో వాస్తవ పరిస్థితులను అధ్యయనం చేశారు. చిదినేపల్లి పాఠశాల ప్రధానోపాధ్యాయులు, కాంట్రాక్టర్లు కలిసి భవనం కూల్చివేతకు పాల్పడ్డారని, జిల్లా కలెక్టర్ ను, జిల్లా విద్యాశాఖ అధికారి నుంచి ముందస్తు అనుమతులు లేకుండా భవనాన్ని ఎలా కూల్చివేస్తారని ఆయన ప్రశ్నించారు. శిథిలావస్థకు చేరుకున్నప్పటికీ ప్రభుత్వ భవనాలను కూల్చాలంటే సంబంధిత శాఖ అధికారుల సమగ్ర సమాచార నివేదిక మేరకు మాత్రమే చర్యలు చేపట్టాల్సి ఉండగా ఎలాంటి ముందస్తు అనుమతులు లేకుండా భవనాన్ని కూల్చడం చట్ట విరుద్ధ చర్యగా బొడ్డు స్మరన్ పేర్కొన్నారు. ప్రభుత్వ పాఠశాల భవనాన్ని కూల్చివేసిన పాఠశాల ప్రధానోపాధ్యాయులు, సదరు కాంట్రాక్టర్ పై కఠిన చర్యలు తీసుకోవాలని భారత విద్యార్థి సమైక్య జిల్లా అధ్యక్షుడు బొడ్డు స్మరన్ డిమాండ్ చేశారు.

## 18న మంత్రితో చెల్పూర్ పీహెచ్‌సీ నూతన భవనం ప్రారంభం

**వరంగల్ వాయిస్, గణపురం :** మండల కేంద్రంలోని చెల్పూర్ నూతన ఆరోగ్య కేంద్ర భవనాన్ని ఈనెల 18న రాష్ట్ర ఆరోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ ప్రారంభించినట్లు మండల కాంగ్రెస్ అధ్యక్షుడు రేపటి రాజేందర్ తెలిపారు. భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు భవన ప్రారంభోత్సవానికి మంత్రిని ఆహ్వానించినట్లు పేర్కొన్నారు. కాగా, గణపురం పీహెచ్‌సీతో పాటు చిల్పూర్ పీహెచ్‌సీ అభివృద్ధికి ఎమ్మెల్యే పెద్ద ఎత్తున నిధుల మంజూరు ప్రకటన ఆరోగ్య మంత్రితో చేయిస్తారని ఆయన వివరించారు.

## కల్లుగీత కార్మిక సంఘం వార్షికోత్సవాల కరపత్రం ఆవిష్కరణ



**వరంగల్ వాయిస్, మడికొండ :** తెలంగాణ కల్లుగీత కార్మిక సంఘం 67 ఏళ్లు ప్రయాణంలో సాధించిన విజయాలను, తెలంగాణ రాష్ట్రంలోని ఈ పది సంవత్సరాల కాలంలో సంఘం చేసిన కార్యక్రమాలను యాది చేసుకుంటూ భవిష్యత్తు తరాలకు బాటలు వేసేందుకు ఈనెల 18న హైదరాబాద్ సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో ఉత్సవాల విజయవంతం చేయాలని కల్లుగీత కార్మిక సంఘం జిల్లా అధ్యక్ష కార్యదర్శులు గౌని సాంబయ్య గౌడ్, బుర్ర శ్రీనివాస్ గౌడ్ లు కోరారు. మంగళవారం మడికొండ శ్రీ మెట్టు రామలింగేశ్వర స్వామి దేవస్థానం ఆలయ ప్రాంగణంలో జిల్లా కమిటీ సమావేశం నిర్వహించి కేజీకేఎస్ 67వ వార్షికోత్సవ కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వార్షికోత్సవ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా బీసీ సంక్షేమ శాఖ మంత్రి, పొన్నం ప్రభాకర్, ఎక్సైజ్ శాఖ మంత్రి, జూపల్లి కృష్ణారావు, బీసీ కార్పొరేషన్ చైర్మన్ బుర్ర వెంకటేశం గౌడ్ పాల్గొంటున్నారని తెలిపారు. ఉమ్మడి తెలుగు రాష్ట్రంలో 1957 సంవత్సరంలో ఆంధ్రప్రదేశ్ కల్లు గీత కార్మిక సంఘం ఖమ్మం గార్లలో ఆవిర్భవించిందని, చెట్టుపై హక్కు నౌకరు నామ రద్దు, ఎక్స్ గ్రేషియా పెన్షన్ తదితర హక్కులు పోరాడి సాధించుకున్నామని బొమ్మగాని ధర్మభిక్షం, ఎస్ఆర్ దాట్ల దేశిని చిన్న మల్లయ్య, తొట్ల మల్సూర్, బైరు మల్లయ్య, పెరుమాండ్ల జగనాదం, బోలగాని పుల్లయ్య లాంటి ఎందరో అమరవీరుల స్ఫూర్తితో కల్లుగీత కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించామని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా సీనియర్ నాయకులు కోతి సాంబరాజు, సారా వెంకటేశం, రాజు, రవి, వేణు, మండల అధ్యక్షులు జనగాని లక్ష్మినారాయణ, మోటపోతుల రాజు, బత్తిని నాగరాజు, రమేష్, మండల ప్రధాన కార్యదర్శిలు కోటగిరి రాజు, ఛట్టారీ జిల్లా కార్యవర్గ సభ్యులు, గీత కార్మికులు, తదితరులు పాల్గొన్నారు.

## కాటారంలో ఎల్ఆర్ఎస్ సర్వే



**వరంగల్ వాయిస్, కాటారం :** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన భూముల సర్వే శరవేగంగా కొనసాగుతోంది. ఈ నేపథ్యంలో జయశంకర్ భూపాలపల్లి జిల్లా కాటారం మండలంలో మంగళవారం సర్వే బృందం పనులు మొదలు పెట్టింది. కాటారం మండలంలో మండల పంచాయతీ అధికారి పి.వీరస్వామి ఆధ్వర్యంలో ఎల్ఆర్ఎస్ సర్వే నిర్వహించారు. ఈ కార్యక్రమంలో టీం లీడర్ పంచాయతీ కార్యదర్శి షఫీర్ ఖాన్, నవ్యశ్రీ, పి.శ్రీనివాస్, నాగరాజు, రాజశేఖర్, వంశీకృష్ణ, గంగాధరన్, ప్రవీణ్, కుమార స్వామి, రెవెన్యూ, ఇరిగేషన్, పంచాయతీ శాఖల ప్రతినిధులు పాల్గొన్నారు.

## కాంగ్రెస్ పరిపాలనపై కిషన్ రెడ్డి మాటలను ఖండిస్తున్నాం

### చిప్ప వెంకటేశ్వర్లు నేత



**వరంగల్ వాయిస్, వరంగల్ :** అస్తవ్యస్తంగా కాంగ్రెస్ పాలన అంటూ నిన్న వరంగల్ లో కేంద్రమంత్రి కిషన్ రెడ్డి మాట్లాడిన తీరును ఖండిస్తున్నట్లు చిప్ప వెంకటేశ్వర్లు నేత, టీపీసీసీ చేనేత విభాగం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ తెలిపారు. రాష్ట్రంలో సీఎం రేవంత్ రెడ్డి పాలన పట్ల ప్రజలు పూర్తి విశ్వాసంతో ఉన్నారన్నారు. దాన్ని జీర్ణించుకోలేక కిషన్ రెడ్డి కాంగ్రెస్ పై తప్పుడు ఆరోపణలు చేస్తున్నారన్నారు. దేశవ్యాప్తంగా ప్రధాని మోడీ గ్రాఫ్ పడిపోతుందని, రాష్ట్ర అధ్యక్ష పదవి కాపాడుకోవడానికి కిషన్ రెడ్డి కాంగ్రెస్ పై దుష్ప్రచారం చేస్తున్నారన్నారు. ప్రజలకు ఇచ్చిన మాట ప్రకారం కాంగ్రెస్ పార్టీ ఆరు పథకాలను అమలు చేస్తూ మాట నిలుపుకుందన్నారు. తెలంగాణలో కాంగ్రెస్ పాలనపై మాట్లాడే నైతిక హక్కు బీజేపీకి లేదని శ్రీనివాస్ పేర్కొన్నారు. విభజన హామీలను పక్కన పెట్టి, కేంద్ర బడ్జెట్ లో తెలంగాణకు అన్యాయం చేసినపుడు మాట్లాడని కిషన్ రెడ్డి బయ్యారం ఉక్కు, కాజీపేట కోచ్ ఫ్యాక్టరీ తీసుకురాని మీరు మాట్లాడితే దయ్యాలు వేదాలు వల్లినట్లు ఉందని ఎద్దేవా చేశారు.

## మహేందర్‌ను సన్మానించిన రాష్ట్ర గవర్నర్



**వరంగల్ వాయిస్, హైదరాబాద్ :** దివ్యాంగుల కోసం స్నేహపూర్వక పర్యావరణం–ఫెడ్ ఆధ్వర్యంలో గవర్నర్ రాజ్ భవన్ లోని సంస్కృతి హాల్ లో మంగళవారం ఇంటర్నేషనల్ వైట్ కేన్ సేఫ్టీ కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో ఫెడ్ ఆహ్వానం మేరకు జిల్లా నుంచి పాల్గొన్న ప్రముఖ కవి, ఉపాధ్యాయుడు, దివ్యాంగుల సామాజిక వేదిక వ్యవస్థాపకుడు బిల్ల మహేందర్ ను తెలంగాణ రాష్ట్ర గవర్నర్ శ్రీ జిష్ణు దేవ్ వర్మ జీ, రాష్ట్ర విద్యాశాఖ ముఖ్య కార్యదర్శి బుర్రా వెంకటేశం శాలువాతో సత్కరించి జ్ఞాపికను అందజేశారు. వైకల్యాలున్న వ్యక్తుల హక్కులు, గౌరవాన్ని ప్రోత్సహించడంలో, ప్రత్యేకించి దృష్టి లోపం ఉన్నవారి కోసం మరింత సమగ్రమైన, స్వతంత్ర వాతావరణాన్ని పెంపొందించడంతో పాటుగా దివ్యాంగులు గౌరవంగా, ఆత్మవిశ్వాసంతో జీవించడానికి ఫెడ్ సంస్థ చేస్తున్న కృషి అభినందనీయమన్నారు. ఇలాంటి గొప్ప కార్యక్రమంలో భాగస్వాములుగా చేసిన సంస్థ ప్రతినిధులు గంగారాం, నాగభూషణ్ లకు మహేందర్ కృతజ్ఞతలు తెలియజేశారు.

## ఇందిరమ్మ కమిటీ నియామకం



**వరంగల్ వాయిస్, నడికూడ :** హనుమకొండ జిల్లా నడికూడ మండలం నడికూడ గ్రామ ఇందిరమ్మ కమిటీ నియామకాన్ని మంగళవారం చేపట్టారు. పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాష్ రెడ్డి ఆదేశానుసారం కాంగ్రెస్ పార్టీ గ్రామ కమిటీ అధ్యక్షుడు తాళ్ల నవీన్ ఆధ్వర్యంలో చేపట్టిన కమిటీలో సభ్యులుగా నడికూడ గ్రామానికి చెందిన డాక్టర్ మల్లాలావు, రావుల సురేష్, దుప్పటి సదానందం, అప్పం రేణుక, నీరటి రజితలను నియమించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం పేదల సొంతింటి కలను నెరవేర్చడం కోసం ఇందిరమ్మ కమిటీలను నియమించిందని, ఈ సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి కృతజ్ఞతలు తెలియజేస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామ కమిటీ సభ్యులు కార్యకర్తలు పాల్గొన్నారు.

# గురుకుల పాఠశాల గేట్లకు తాళాలు వేసిన వారిపై క్రిమినల్ కేసులు

### మంత్రి పొన్నం ప్రభాకర్



**వరంగల్ వాయిస్, హైదరాబాద్ :** గురుకుల పాఠశాల గేట్లకు తాళాలు వేసిన వారిపై క్రిమినల్ కేసులు వేయాలని కలెక్టర్లను రవాణా, బీసీ సంక్షేమ శాఖమంత్రి పొన్నం ప్రభాకర్ ఆదేశించారు. దసరా సెలవుల అనంతరం విద్యాశాఖకు సంబంధించి గురుకులాలు, కాలేజీలు , పాఠశాలలు ప్రారంభం అవుతున్నాయి. 70 శాతం గురుకులాలు అద్దె భవనాల్లోనే కొనసాగుతున్నాయి. ఇది ఈ 10 నెలల్లో పెట్టిన బకాయిలు కాదు, ఇది యజమానులు గమనించాలి. గత కొద్ది సంవత్సరాలుగా రాని బకాయిలు అడగలేక, ముఖ్యమంత్రి, ఉపముఖ్యమంత్రి నాయకత్వంలో వివరాలు తెప్పించుకొని వాటిని విడుదల చేసి భవనాల సమస్యలు పరిష్కరించాలని సమావేశాలు కూడా నిర్వహించారు. నేడో రేపు నిధులు విడుదల చేసే సమయంలో ప్రభుత్వంతో ఎవరి మాటలు పట్టుకొని కావాల్సి కవ్వింపు చర్యలకు పాల్పడవద్దని కోరుతున్నారు. ఇది మంచిది కాదు ప్రభుత్వం బకాయిలు చెల్లించే ప్రక్రియ కొనసాగుతుంది. గురుకుల మంత్రిగా విజ్ఞప్తి చేస్తున్న ఇబ్బందితో గురుకుల పెట్టిన బ్యానర్లు వెంటనే తొలగించాలన్నారు. విద్యార్థులకు సక్రమంగా తరగతులు నడిపించే విధంగా చర్యలు తీసుకోవాలని కోరారు. లేదంటే ప్రభుత్వపరంగా చర్యలు ఉంటాయని హెచ్చరించారు. పాత బకాయిలు ఇప్పించే బాధ్యత మాది, నేను, ఉప ముఖ్యమంత్రి భట్టివిక్రమార్క అన్ని గురుకులాలపై సమీక్ష నిర్వహించి సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. గురుకుల భవన యజమానులకు విజ్ఞప్తి వెంటనే బ్యానర్లు తొలగించాలన్నారు. విద్యార్థులకు స్వాగతం పలకండి. వారి విద్యా బోధనకు ఆటంకం కలిగిస్తే చట్టపరంగా ఎటువంటి చర్యలు ఉంటాయో మీకు తెలుసు. మీకు బకాయిని చెల్లించే బాధ్యత మాది లేదంటే నన్ను గాని, ముఖ్యమంత్రిని కానీ అధికారులను కలవండన్నారు. పాత బకాయిలతో సహా మెస్ చార్జీలు మూడు రోజుల క్రితమే చెల్లించామని తెలిపారు. గురుకులాలు తాళం వేసి తలుపులు వేస్తే కఠిన చర్యలు ఉంటాయని హెచ్చరించారు. గురుకుల ప్రిన్సిపల్, ఆర్సీవోలు ఎక్కడైనా యజమానులు ఇబ్బందులు పెడితే పోలీస్ స్టేషన్ లో ఫిర్యాదులు చేయండి, క్రిమినల్ చర్యలు తీసుకోండని కలెక్టర్లకు ఆదేశాలు ఇచ్చారు. ప్రత్యామ్నాయంగా అక్కడ నుంచి ఖాళీ చేసి వేరే భవనాలు చూడండని తెలిపారు.

# కాంగ్రెస్ ప్రభుత్వం ఆరు గ్యారంటీలను అమలు చేయాలి




**వరంగల్ వాయిస్, మహబూబాబాద్ :** కాంగ్రెస్ ప్రభుత్వం హామీ ఇచ్చిన ఆరు గ్యారంటీలను అమలు చేయాలంటూ సీపీఐ (ఏం.ఎల్) న్యూ డెమోక్రసీ పార్టీ ఆధ్వర్యంలో మహబూబాబాద్ జిల్లా కేంద్రంలో పార్టీ శ్రేణులు భారీ ప్రదర్శన నిర్వహించి అనంతరం తహశీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. రాష్ట్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలతో కార్యాలయ ప్రాంతాన్ని పార్టీ శ్రేణులు హోరెత్తించారు. ఈ సందర్భంగా సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ పార్టీ జిల్లా కార్యదర్శి బండారు ఐలయ్య మాట్లాడుతూ ఆరు గ్యారెంటీలను అమలు చేయడంలో రాష్ట్ర ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని ధ్వజమెత్తారు. వంద రోజుల్లో 6 గ్యారంటీలు అమలు చేస్తామని, 11 నెలలు దాటినా రాష్ట్ర ప్రభుత్వం పట్టించుకోవడంలేదని ఆవేదన వ్యక్తం చేశారు. రుణమాఫీ పూర్తి స్థాయిలో అమలుకు నోచుకోలేదని,రైతు భరోసా పెట్టుబడి సాయం అందక రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నరన్నారు. మహాలక్ష్మి పథకం ద్వారా మహిళలకు 2500 రూపాయలు, కళ్యాణ లక్ష్మి పథకంలో తులం బంగారం, రైతు భరోసా, పింఛన్లు అందించాలని డిమాండ్ చేశారు. సీఎం రేవంత్ రెడ్డి ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను నెరవేర్చాలని, లేకుంటే ఆందోళనలు రాష్ట్ర వ్యాప్తంగా ఉధృతం చేస్తామని ఆయన హెచ్చరించారు. ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను అమలుపరిచి మాట నిలుపుకోకపోతే కాంగ్రెస్ ప్రభుత్వానికి బీఆర్ఎస్ పార్టీకి పట్టిన గతే పడుతుందని విమర్శించారు. బండారు ఐలయ్య సీపీఐ (ఎంఎల్) న్యూడెమోక్రసీ పార్టీ జిల్లా కార్యదర్శి మండల వెంకన్న, అఖిల భారత రైతు కూలీ సంఘం రాష్ట్ర కార్యదర్శి పాల్గొన్నారు.

## అద్దె చెల్లిస్తేనే తాళం తీస్తాం

### ఎంజేపీ గురుకుల పాఠశాల భవన యజమానులు

### వెనుతిరిగి వెళ్లిన పిల్లలు, టీచర్స్



**వరంగల్ వాయిస్, రేగొండ :** ఏడాది కాలంగా అద్దె బకాయిలు చెల్లించనందుకు రేగొండ మండలంలోని లింగాల క్రాస్ వద్ద గల తెలంగాణ మహాత్మా జ్యోతి రావు పూలే బాలికల గురుకుల పాఠశాల నిర్వహిస్తున్న ఇంటి యజమాని అలాగే రేగొండ మండల కేంద్రంలోని మహాత్మా జ్యోతి రావు పూలే బాలుర గురుకుల పాఠశాల గేటుకు మంగళవారం ఉదయం తాళం వేసుకున్నారు. సెలవులు ముగించుకొని పాఠశాల విధులకు హాజరయ్యేందుకు వచ్చిన ప్రిన్సిపాల్ తో పాటు ఇతర సిబ్బందిని లోనికి వెళ్లనివ్వలేదు. దీంతో వారంతా పాఠశాల ముందు రోడ్డుపైనే ఉండాల్సి వచ్చింది. ఈ సందర్భంగా ఇంటి యజమానులు చిర్ర మహేందర్, కటకం రాజులు మాట్లాడుతూ గత 8 మాసాలుగా ప్రభుత్వం అద్దె బకాయిలు చెల్లించడం లేదని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రతి నెల అద్దె బకాయిలు చెల్లించాలని పేర్కొంటూ రాష్ట్ర సంఘం ఆధ్వర్యంలో అధికారులకు వినతి పత్రాలు ఇచ్చి విసిగిపోవడంతో పాటు చివరకు భవనాలకు తాళాలు వేస్తామని నోటీసులు ఇచ్చామని, అయినా ప్రభుత్వానికి స్పందన లేదన్నారు. బకాయిలు చెల్లించిన పిదపనే తాళాలు తీస్తామని స్పష్టం చేశారు.




## మహనీయుల విగ్రహాలను ధ్వంసం చేసిన వారిని కఠినంగా శిక్షించాలి

### తాటిపాముల వెంకట్రాములు



**వరంగల్ వాయిస్, వరంగల్ :** సమాజ శ్రేయస్సు కోసం కృషి చేసిన మహనీయుల విగ్రహాలను ధ్వంసం చేయటం అత్యంత దుర్మార్గమని అలాంటి దుండగులను కఠినంగా శిక్షించాలని బీసీ హక్కుల సాధన సమితి రాష్ట్ర అధ్యక్షుడు తాటిపాముల వెంకట్రాములు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఇటీవల వరంగల్ దేశాయిపేటలో ఉన్న మహాత్మ జ్యోతిబాపూలే విగ్రహాన్ని కొందరు దుండగులు కిరాతకంగా ధ్వంసం చేశారని, అయితే పోలీసు అధికారులు తక్షణమే స్పందించి పూలే విగ్రహాన్ని తిరిగి ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. జ్యోతిబాపూలే, గాంధీ, అంబేద్కర్ మొదలైన మహనీయుల విగ్రహాలను కావాలని కొందరు దుండగులు ఆయా ప్రాంతాలలో ధ్వంసం చేస్తున్నారని, అలాంటి ఘటనలపై సమగ్రమైన విచారణ చేసి వారిని కఠినంగా శిక్షించకపోవడం వల్ల ఇలాంటి ఘటనలు అనేకం పదే పదే జరుగుతున్నాయన్నారు. ప్రజలు ప్రజాస్వామ్య వాదులు ఇలాంటి దుశ్చర్యలను తీవ్రంగా ఖండించాలన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం మహనీయుల విగ్రహాల పరిరక్షణకు తగిన పటిష్టమైన చర్యలు చేపట్టాలన్నారు. వరంగల్ లో పూలే విగ్రహాన్ని ధ్వంసం చేసిన సంఘటనపై సమగ్రంగా విచారణ చేయాలని, దోషులు ఎంతటి వారైనా కఠినంగా శిక్షించి భవిష్యత్తులో ఇలాంటి సంఘటనలు పునరావృత్తం కాకుండా చూడాలని వెంకట్రాములు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

# బోడ్రాయి ఉత్సవాల్లో భక్తిశ్రద్ధలతో కుంకుమార్చన



**వరంగల్ వాయిస్, వరంగల్ :** నగరంలోని ఫోర్ట్ రోడ్డులోని ఏకశిలానగర్ లో జరుగుతున్న బొడ్రాయి ప్రతిష్టాపన సందర్భంగా సోమవారం రాత్రి ఎనిమిది గంటల నుంచి అర్ధరాత్రి 2 గంటల వరకు బొడ్రాయి గ్రామ దేవతలకు జలాభిషేకం నిర్వహించారు. ఏకశిలానగర్ ప్రాంతం అంతా బొడ్రాయి ప్రతిష్టాపన సందడి ఓం జెండాలు కొబ్బరి మట్టలతో మామిడి తోరణాలతో బంతి పూలతో వాడలల్లో అలంకరణ చేసుకొని పండుగ వాతావరణం నెలకొంది. ఎటు చూసినా ఎటు వెళ్లిన ఏ షాపుకెళ్లిన ఏ వీధిలో కెళ్లినా చిన్ననాటి స్నేహితులు బంధువులు అందరూ ఈ సందర్భంగా కలుసుకొని చిన్ననాటి జ్ఞాపకాలు నెమరువేసుకుంటున్నారు. బొడ్రాయి ప్రతిష్టాపన సందర్భంగా విదేశాల నుంచి వివిధ ప్రాంతాల నుంచి విచ్చేశారు. బొడ్రాయి గ్రామ దేవతలకు జలాభిషేక కార్యక్రమంలో కుటుంబ సభ్యులు అందరూ కలిసి రాగి బిందెలో నీళ్లను తీసుకొని అక్క చెల్లెల్లు కుటుంబ సభ్యులు అందరూ కలిసి బొడ్రాయి గ్రామ దేవత భూలక్ష్మి మహాలక్ష్మి ప్రతిష్ట వరకు జై భూలక్ష్మి, జై మహాలక్ష్మి అంటూ ఆడపడుచులు వీధుల నుంచి నినాదాలు చేస్తూ వెళ్లి జలాభిషేకం చేస్తున్నారు. నగర ప్రజలు, గ్రామ ప్రజలు, కుటుంబ సభ్యులు అందరూ ఆయురారోగ్యాలతో ఉండాలని మొక్కుతూ పూజలు నిర్వహిస్తున్నారు. మంగళవారం ఉదయం 10 గంటలకు కుంకుమార్చన నిర్వహించారు.

ఈ కార్యక్రమంలో మహిళలు శ్రద్ధలతో పూజలు చేశారు. కుంకుమార్చన వెలిదే ప్రదీప్ శర్మ ఆధ్వర్యంలో వేద మంత్రాలతో అత్యంత వైభవంగా జరిగింది. ఈ పూజలో ఏకశిల నగర్ మహిళలు భారీ సంఖ్యలో హాజరై ప్రజలు బాగుండాలని ఆడపడుచులు అందరూ అమ్మవారిని వేడుకున్నారు. ఈ కార్యక్రమంలో ఏకశిలా నగర్ బొడ్రాయి, పోచమ్మ, మైసమ్మ, దేవాలయాల అభివృద్ధి కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

# ఓంకార్ 16వ వర్ధంతిని జయప్రదం చేయండి




**వరంగల్ వాయిస్, వరంగల్ :** ఎంసీపీఐ వ్యవస్థాపకుడు, నర్సంపేట మాజీ శాసనసభ్యుడు, తెలంగాణ సాయుధ పోరాట యోధులు కామ్రేడ్ మద్ది కాయల ఓంకార్ 16వ వర్ధంతి సభను జయప్రదం చేయాలని ఎంసీపీఐయూ జిల్లా సహాయ కార్యదర్శి నర్రా ప్రతాప్, ఎంసీపీఐయూ నగర కార్యదర్శి కామ్రేడ్ సుంచు జగదీశ్వర్, వరంగల్ అండర్ బ్రిడ్జి వద్ద పార్టీ ఆఫీసులో కరపత్రం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సూర్యాపేట జిల్లా ఆత్మకూరు ఎస్ మండలం ఏపూరి గ్రామంలో జన్మించిన ఓంకార్ 14వ ఏళ్ల వయసులోనే భూస్వాములు నాటి నైజాములకు వ్యతిరేకంగా, దోపిడి, వెట్టిచాకిరి, బానిసత్వం, మహిళలపై సాగుతున్న దురాక్రమణలకు వ్యతిరేకంగా పోరాటాలు నిర్వహించారు. అటవీ భూములను 50 వేల ఎకరాలు, భూస్వాముల భూములు పేదలకు పంచి దున్నేవాడికే భూమి కావాలని పోరాడిన మహా నాయకుడు కామ్రేడ్ ఓంకార్ అని కొనియాడారు. వారు చనిపోయి 16 సంవత్సరాల అవుతున్న సందర్భంగా అక్టోబర్ 17న నర్సంపేట తాలూకా మచ్చాపురంలో నూట ఇరవై ఐదు అడుగుల స్థూపం వద్ద సభ నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. ఈ సభకు ప్రజలు, ప్రజాతంత్ర వాదులు అధిక సంఖ్యలో పాల్గొని సభను విజయవంతం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ జిల్లా కమిటీ సభ్యులు ఐతం నాగేష్, మాలి ప్రభాకర్, అప్పనపురి నర్సయ్య, నలివెల రవి, రాయినేని ఐలయ్య, జటబోయిన నరసయ్య తదితరులు పాల్గొన్నారు.

# విజ్ఞాన గని భారతరత్న డా.ఏపీజీ అబ్దుల్ కలాం



## దాస్యం వినయ్ భాస్కర్

**వరంగల్ వాయిస్, హనుమకొండ :** విజ్ఞాన గని భారతరత్న డా.ఏపీజీ అబ్దుల్ కలాం అని మాజీ చీఫ్ విప్, బీఆర్ఎస్ పార్టీ హనుమకొండ జిల్లా అధ్యక్షుడు దాస్యం వినయ్ భాస్కర్ అన్నారు. బాలసముద్రంలోని బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో మంగళవారం డా.ఏపీజీ అబ్దుల్ కలాం జయంతి కార్యక్రమాన్ని పులి రజినీకాంత్ అధ్యక్షతన నిర్వహించారు. కలాం చిత్రపటానికి పూల మాలలు వేసి, నివాళులు అర్పించి నినాదాలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మిసైల్ మ్యాన్ ఆఫ్ ఇండియా ఆయన కీర్తి అజరామరం, కలాం సేవలు ఈ దేశం మరవదన్నారు. అణు ఆయుధ రూపకల్పనలో, క్షిపణుల తయారీలో ఆయన కృషి ప్రపంచానికే మార్గదర్శమైందని తెలిపారు. ఆయన జీవితం ఎంతో మంది విద్యార్థులకు స్ఫూర్తిగా నిలుస్తోందన్నారు. శాస్త్ర, సాంకేతిక రంగాల్లో భారతదేశ ఖ్యాతిని ప్రపంచ స్థాయిలో నిలిపిన మహనీయుడు ఏపీజే అని కొనియాడారు. శాస్త్రవేత్తగా, రాష్ట్రపతిగా, ఈ దేశ పౌరుడిగా ఆయన జీవన విధానం ఎంతో మందికి ఆదర్శమని అన్నారు. వారి జీవన ప్రస్థానం ఎందరికో స్ఫూర్తిదాయకమని తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ కుడా చైర్మన్ మర్రి యాదవ రెడ్డి, మాజీ కార్పొరేటర్లు కుసుమ లక్ష్మీనారాయణ, బాబు రావు, సీనియర్ నాయకులు నయీమొద్దీన్, రవీందర్ రావు, జానకీ రాములు, రామ్మూర్తి, మాలకుమ్మరి పరుశురాములు, మహమూద్, గబ్బెట శ్రీనివాస్, రాజు, ఖలీల్, వీరు, విజయ్, యాకుబ్, రఘు, గౌస్ ఖాన్, మహేష్, తరితరులు పాల్గొన్నారు.

# నగర వాసులకు స్వచ్ఛమైన తాగునీరు



**వరంగల్ వాయిస్, వరంగల్ :** బల్దియా ప్రధాన కార్యాలయంలో గత సోమవారం జరిగిన గ్రీవెన్స్ లో 29వ డివిజన్ రామన్నపేటకు చెందిన స్థానిక ప్రజలు కలుషిత నీరు దుర్వాసన మారిన రంగుతో నీరు సరఫరా చేయబడుతుందని, స్వచ్ఛమైన తాగునీరు అందించేలా చర్యలు తీసుకోవాలని పేర్కొంటూ నీటి నమూనాతో కమిషనర్ డాక్టర్ అశ్విని తానాజీ వాకడేకు వినతి పత్రం అందించారు. ఈ నేపథ్యంలో స్పందించిన కమిషనర్ తక్షణమే రామన్నపేట ప్రాంతాన్ని తనిఖీ చేసి కలుషిత నీటి సమస్యను నివారించడానికి చర్యలు తీసుకొని ప్రజలకు స్వచ్ఛమైన త్రాగునీటిని అందించాలని ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించారు. ఈ క్రమంలో ఇంజినీరింగ్ అధికారులు, సిబ్బంది క్షేత్ర స్థాయిలో రామన్నపేటలోని పలు గల్లీలతో పాటు ఫిర్యాదు దారు నల్లా రేణుక ఇం. నెం: 15-6-266/231, ఆర్.విజయ ఇం.నెం: 15- 6-266/101 ప్రాంతాల్లో నల్లా ద్వారా సరఫరా అవుతున్న తాగునీటిని తనిఖీ చేశారు. పిటిషనర్ల ఇళ్ల వద్ద విచారణ జరపగా వారంరోజుల క్రితం సరఫరా అయిన నీటి నమూనాలు తీసుకొచ్చినట్లు తమ దృష్టికి వచ్చిందని, దీన్ని ఫిర్యాదుదారులు స్వయంగా అంగీకరించారని ఎస్ఈ ప్రవీణ్ చంద్ర తెలిపారు. ప్రస్తుతం సరఫరా అవుతున్న నీరు శుభ్రంగా ఉందని, ఎటువంటి వాసన, రంగు లేకుండా తాగడానికి అనుకూలంగా సరఫరా జరుగుతున్నదని, నగరవాసులకు స్వచ్ఛమైన తాగునీరు అందేంచాలనే లక్ష్యంగా పని చేస్తున్నట్లు బల్దియా ఎస్ఈ ప్రవీణ్ చంద్ర మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు.

# ఘనంగా టీడీఎఫ్ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు



**వరంగల్ వాయిస్, వరంగల్ :** తెలంగాణ రాష్ట్రంలోని 59 దళిత కులాలను ఐక్యత చేస్తూ వారి ఆర్థిక అభివృద్ధి కోసం మూడు ప్రత్యేక కార్పొరేషన్లు ఏర్పాటు చేయాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు దళిత సమాజానికి కేటాయించే ఆర్థిక, సంక్షేమ వనరుల నుంచి ప్రత్యేక మాదిగ కార్పొరేషన్, ప్రత్యేక మాల కార్పొరేషన్, ప్రత్యేక ఉపకులాల కార్పొరేషన్, ప్రతి కార్పొరేషన్ కు రూ.100 కోట్ల రూపాయలు బడ్జెట కేటాయించి కార్పొరేషన్లు ఏర్పాటు చేయాలని టీడీఎఫ్ డిమాండ్ చేసింది. రాజకీయ ప్రాతినిధ్యం కోసం భవిష్యత్తు దళిత జాతి కోసం ఈ తెలంగాణ దళిత ఫెడరేషన్ ఆవిర్భవించడం జరిగిందని తెలంగాణ దళిత ఫెడరేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు దబ్బెట శ్రీనివాస్ తెలిపారు. ఈ ఆవిర్భావ దినోత్సవ వేడుకలకు ముఖ్య అతిథిగా ప్రొఫెసర్ గాలి వినోద్ కుమార్ హాజరై తెలంగాణ దళిత ఫెడరేషన్ జెండాను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో టీడీఎఫ్ జిల్లా యూత్ నాయకులు జన్ను అజయ్, టీడీఎఫ్ చెరుకు కర్ణాకర్, జిల్లా నాయకులు చెడిపాక ప్రేమ్ సాగర్, విగ్నేష్, డా:పి ఎలీషా రాజు, టీడీఎఫ్ దళిత క్రైస్తవ విభాగం కోఆర్డినేటర్, కుక్క మూడు అశోక్, టీడీఎఫ్ వరంగల్ జిల్లా ఇంచార్జి, అంజపల్లి రాజు టీడీఎఫ్ వ్యవస్థాపక సభ్యులు, టీడీఎఫ్ నాయకులు గజ్జి రఘుపతి, మాతంగి సురేష్, దంతాలపల్లి దిలీప్ తదితరులు పాల్గొన్నారు.

# మంత్రి సురేఖకు నవ చండీయాగ రక్ష అందజేత



**వరంగల్ వాయిస్, హైదరాబాద్ :** అష్టాదశ శక్తి పీఠాల్లో ఒకటైన జోగులాంబ అమ్మవారి దేవస్థానంలో దసరా శరన్నవరాత్రుల ఉత్సవాలను పురస్కరించుకుని ఉదయాస్తమ సేవలో భాగంగా నిర్వహించిన నవ చండీయాగ రక్షను ఆలయ అర్చకులు కొండా సురేఖకు అందించారు. మంగళవారం హైదరాబాద్ జూబ్లీహిల్స్ లోని మంత్రి నివాసంలో అర్చకులు మంత్రి సురేఖకు అమ్మవారి తీర్థప్రసాదాలను, శేషవస్త్రాలను అందించి, వేదాశీర్వచనం చేశారు. జోగులాంబ అమ్మవారి ఆలయంలో దసరా శరన్నవరాత్రి ఉత్సవాలను విజయవంతంగా నిర్వహించడం పట్ల ఈవో పురేందర్ కుమార్, ఇతర సిబ్బందిని మంత్రి సురేఖ అభినందించారు.

# కంగువాలో ఏఐతో డబ్బింగ్




నిర్మాత కేఈ జ్ఞానవేల్ ఆసక్తికర విషయం వెల్లడి సూర్య ప్రధాన పాత్రలో నటిస్తున్న చిత్రం 'కంగువా' శివ దర్శకత్వంలో రూపొందుతుంది. నవంబర్ 14న ప్రపంచవ్యాప్తంగా విడుదల కానుంది. ఫాంటసీ యాక్షన్ ఫిల్మ్‌గా రూపుదిద్దుకుంటున్న ఈ సినిమా గురించి నిర్మాత కేఈ జ్ఞానవేల్ ఓ ఆసక్తికర విషయాన్ని పంచుకున్నారు. తాజాగా ఎక్స్ వేదికగా నెటిజన్లతో ముచ్చటించిన ఆయన 'కంగువా'లో ఏఐని ఉపయోగించినట్లు చెప్పారు. 'కంగువా'ను ఏకంగా 8 భాషల్లో ఒకేసారి రిలీజ్ చేయనున్న సంగతి తెలిసిందే. దీనికి సంబంధించిన నిర్మాత ఓ విషయం పంచుకున్నారు. తమిళ వెర్షన్‌కు సూర్య డబ్బింగ్ చెప్పగా.. మిగతా భాషల్లో ఏఐ సాయంతో డబ్బింగ్ పనులు పూర్తి చేయనున్నాం. డబ్బింగ్ పనుల కోసం కోలీవుడ్‌లో ఏఐని ఉపయోగించడం ఇదే తొలిసారి. ఇటీవల విడుదలైన 'వేట్టయన్'లో అమితాబ్‌బచ్చన్ వాయిస్‌లో మార్పుల కోసం ఏఐను ఉపయోగించారు. ఇప్పుడు పూర్తిగా డబ్బింగ్ కోసం మేం దీన్ని ప్రయోగిస్తున్నాం. ఇది విజయవంతమవుతుందని భావిస్తున్నాం. ఈ చిత్రం అన్ని ప్రధాన భారతీయ భాషలతో పాటు ఇంగ్లిష్, ఫ్రెంచ్, స్పానిష్‌లలో విడుదల కానుంది. చైనీస్, జపనీస్ విడుదల తేదీలను కూడా త్వరలోనే ప్రకటిస్తాం అని నిర్మాత జ్ఞానవేల్ చెప్పారు. ప్రపంచవ్యాప్తంగా ఈ చిత్రం రూ.1000 కోట్ల కలెక్షన్స్ చేయాలనే లక్ష్యంతో ఉన్నట్లు నిర్మాత ఇటీవల చెప్పారు. పార్ట్ 2, పార్ట్ 3 కథలు సిద్ధంగా ఉన్నాయని.. పార్ట్ 1 విజయం ఆధారంగా వాటిని తెరకెక్కించేలా ప్లాన్ చేయనున్నట్లు తెలిపారు. ఈ సినిమా సూర్యని మరో స్థాయికి తీసుకెళ్తుందని నమ్ముతున్నట్లు చెప్పారు. యాక్షన్‌తోపాటు ఎమోషన్స్‌కు ఇందులో అధిక ప్రాధాన్యం ఉందన్నారు. త్రీడీలోనూ అలరించనున్న ఈ సినిమా చిత్రీకరణ ప్రస్తుతం శరవేగంగా జరుగుతోంది. కంగ అనే ఓ పరాక్రముడి కథతో ఈ సినిమా సిద్ధమవుతున్నట్లు సమాచారం. ఇందులో సూర్య ఆరు భిన్నమైన అవతారాల్లో కనిపించనున్నట్లు తెలుస్తోంది. దిశా పటానీ కథానాయిక. బాబీ దేవోల్ ప్రతినాయకుడిగా కనిపించనున్నారు. జగపతి బాబు, యోగిబాబు, కోవై సరళ కీలక పాత్రలు పోషిస్తున్నారు.





## కొత్త సినిమాను ప్రారంభించిన సాయిదుర్గా తేజ్

వైవిధ్యమైన కథలు ఎంచుకునే హీరోల్లో సాయి దుర్గా తేజ్ ఒకరు. 'విరూపాక్ష', 'బ్రో' తర్వాత ఇప్పుడు మరో ఆసక్తికరమైన కథతో ప్రేక్షకులను పలకరించేందుకు సిద్ధమయ్యారు. ఈ యంగ్ హీరో పుట్టినరోజు సందర్భంగా మంగళవారం కొత్త సినిమాను ప్రకటించారు. ఎస్‌డిటి18 వర్కింగ్ టైటిల్‌తో ఇది తెరకెక్కనుంది. ఈ విషయాన్ని తెలుపుతూ చిత్రబృందం ఓ మేకింగ్ వీడియోను విడుదల చేసింది. 'హనుమాన్' వంటి బ్లాక్‌బస్టర్ చిత్రాలను నిర్మించిన కె నిరంజన్ రెడ్డి, చైతన్య రెడ్డి ఈ సినిమాను నిర్మిస్తున్నారు. ఈ చిత్రంతో రోహిత్ కేపీ దర్శకుడిగా పరిచయం కానున్నారు. 'ధైర్యాన్నే తన కవచంగా, ఆశనే ఆయుధంగా చేసుకున్న ఈ వ్యక్తి అందరికోసం నిలబడతాడు. ఇది కేవలం ప్రారంభం మాత్రమే' అనే క్యాప్షన్‌తో ఓ వీడియోను విడుదల చేస్తూ చిత్రబృందం సాయి దుర్గా తేజ్‌కు పుట్టినరోజు శుభాకాంక్షలు తెలిపింది.





## గేమ్‌ఛేంజర్‌కు పోటీగా తండేల్ విడుదల

టాలీవుడ్ యాక్టర్ అక్కినేని నాగచైతన్య నటిస్తోన్న ప్రాజెక్ట్ తండేల్ రొమాంటిక్ డ్రామా నేపథ్యంలో తెరకెక్కుతున్న ఈ చిత్రాన్ని చందూ మొండేటి డైరెక్ట్ చేస్తున్నాడు. సాయిపల్లవి ఫీ మేల్ లీడ్ రోల్‌లో నటిస్తోంది. ఈ చిత్రాన్ని డిసెంబర్ 20న ప్రపంచవ్యాప్తంగా గ్రాండ్‌గా విడుదల చేస్తున్నట్టు చాలా రోజుల క్రితమే ప్రకటించగా.. తండేల్ విడుదల వాయిదా పడే అవకాశాలున్నాయంటూ మరో వార్త తెరపైకి వచ్చింది. తాజాగా తండేల్ సంక్రాంతి బరిలో నిలువబోతుందన్న అప్‌డేట్ నెట్టింట హల్ చల్ చేస్తోంది. మరోవైపు రాంచరణ్ టైటిల్ రోల్ పోషిస్తున్న గేమ్ ఛేంజర్ 2025 జనవరి 10న విడుదల కానుందని మేకర్స్ ఇప్పటికే ప్రకటించారని తెలిసిందే. ఇదే నిజమైతే బాక్సాఫీస్ వద్ద గేమ్ ఛేంజర్‌తో పోటీ పడటం ఖాయమైపోయినట్టే. మరి తండేల్ రిలీజ్‌పై మేకర్స్ ఏదైనా క్లారిటీ ఇస్తారేమో చూడాలి. తండేల్‌లో సాయిపల్లవి శ్రీకాకుళం అమ్మాయి సత్య పాత్రలో నటిస్తోంది. 2018లో గుజరాత్ జరిగిన వాస్తవ ఘటనల ఆధారంగా తెరకెక్కుతున్న ఈ మూవీని గీతాఆర్ట్స్‌పై అల్లు అరవింద్ సమర్పణలో బన్నీవాసు నిర్మిస్తున్నారు. ఈ చిత్రానికి అనిరుధ్ రవిచందర్ మ్యూజిక్, బ్యాక్‌గ్రౌండ్ స్కోర్ అందిస్తున్నాడు. తండేల్ నాగచైతన్య `చందూ మొండేటి కాంబోలో రాబోతున్న మూడో సినిమా కావడం విశేషం. మేకర్స్ ఇప్పటికే లాంచ్ చేసిన ఫస్ట్ లుక్‌లో చైతూ మత్స్యకారుడిగా మాస్ లుక్‌లో కనిపిస్తూ సినిమాపై సూపర్ హైప్ క్రియేట్ చేస్తున్నాడు.

## ట్రెజరీ ఆధారంగా నాగబంధం

'పెదకాపు' చిత్రంతో పరిచయమైన విరాట్‌కర్ణ కథానాయకుడిగా తెరకెక్కుతున్న చిత్రం 'నాగబంధం: ది సీక్రెట్ ట్రెజర్'. నభా నటేశ్ కథానాయిక. అభిషేక్ నామా దర్శకత్వం వహిస్తున్నారు. అభిషేక్ పిక్చర్స్, తారక్ సినిమాస్ సంస్థలతో కలిసి ఎన్.ఐ.కె.స్టూడియోస్ పతాకంపై కిశోర్ అన్నపురెడ్డి నిర్మిస్తున్నారు. లక్ష్మీ ఐరా, దేవాన్ష్ నామా సమర్పకులు. ఈ సినిమా ప్రారంభోత్సవం హైదరాబాద్‌లో జరిగింది. అగ్ర కథానాయకుడు చిరంజీవి ముఖ్య అతిథిగా హాజరై ముహూర్తపు సన్నివేశానికి క్లాప్‌నిచ్చారు. మాజీ మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్ కెమెరా స్విచ్చాన్ చేశారు. దర్శకుడు అజయ్ భూపతి గౌరవ దర్శకత్వం వహించారు. ఏషియన్ సునీల్ చిత్రబృందానికి స్క్రిప్ట్‌ని అందజేశారు. తిరువనంతపురంలోని పద్మనాభ స్వామి ఆలయంలో నిధి, పూరి జగన్నాథ ఆలయంలో రత్న భాండాగారాన్ని తెరిచిన తర్వాత గుప్తనిధుల అంశం చర్చనీయాంశంగా మారింది. నాగబంధం రక్షణలో ఉన్న అలాంటి 108 దేవాలయాలతో ముడిపడిన కథ ఇది. భక్తి, సాహసాలు, అంతుచిక్కని రహస్యాలతో ఓ శక్తిమంతమైన కథని తయారు చేశారు అభిషేక్ నామా. ఈ నెల 23 నుంచే రెగ్యులర్ చిత్రీకరణని ప్రారంభిస్తాం. వచ్చే ఏడాది తెలుగుతోపాటు, హిందీ, తమిళ, కన్నడ, మలయాళ భాషల్లో ఏకకాలంలో విడుదల చేస్తామని సినీ వర్గాలు తెలిపాయి. కథానాయకుడు విరాట్‌కర్ణ మాట్లాడుతూ ఈ సినిమా చాలా బాగుంటుంది. చిరంజీవి చేతులమీదుగా ప్రారంభం కావడం ఆనందంగా ఉందని అన్నారు. ఐశ్వర్య మేనన్, జగపతిబాబు, జయప్రకాశ్, మురళీశర్మ, బి.ఎస్.అవినాశ్ తదితరులు నటిస్తున్నారు.







# ఇచ్చుకో.. చేసుకో ?



- గ్రామాల్లో గుడుంబా గుబాలింపు
- భారీగా వసూళ్ల పర్వం
- మామూళ్ల మత్తులో అధికారులు
- సీసాలు పట్టుకొని బస్తాలు వదిలేస్తున్న వైనం
- తండాలో పుట్టగొడుగుల్లా సారా బట్టీలు
- క్యాష్ చేసుకుంటున్న బెల్లం వ్యాపారులు
- గుడుంబా లీటర్ కు రూ. 500
- రోడ్డున పడుతున్న కుటుంబాలు

**వరంగల్ వాయిస్, డోర్నకల్ :** తక్కువ ధరకు దొరుకుతుందని రెండు పెగ్గులు వేసి ప్రాణలు పోగొట్టుకోవడంతో వీదిన పడుతున్న కుటుంబాల సంఖ్య రోజురోజుకు పెరుగుతోంది. దీనికి కారణమైన గుడుంబా మహమ్మారి గ్రామాల్లో గుబాలిస్తోంది. గుడుంబాను నిషేధించామంటూ ప్రభుత్వం చెబుతున్నప్పటికీ 24గంటలు అందుబాటులో ఉందనడానికి సూర్యచంద్రులే సాక్షిబుతాలుగా నిలుస్తున్నారు. అరికట్టాల్సిన అధికారులు బెల్లం అమ్మకం దారులనుంచి భారీ మొత్తంలో మామూళ్లు తీసుకుంటున్నారనే ఆరోపణలు బలంగా వినిపిస్తున్నాయి. అయితే ఎక్సైజ్ అధికారులు తమ ఉనికిని చాటుకునేందుకు గుడుంబా విక్రయదారులను మాత్రమే టార్గెట్ చేసి వారి వద్ద ఉన్న సీసాలు పగల కొడుతున్నట్లు ప్రచారం సాగుతోంది. అయితే మామూళ్ల మత్తులో తూలుతున్న అధికారులు గుడుంబా తయారీకి కావాల్సిన ముడు సరుకులు ఎక్కడినుంచి వస్తున్నాయన్న కోణంలో విచారణ చేయడం లేదన్న విమర్శలున్నాయి. కేవలం ఆయారాం..గాయారాం అన్నట్లుగా కేవలం దాడులు నిర్వహిస్తున్నారని స్థానికులు మండిపడుతున్నారు. వీరికి బెల్లం ఎక్కడి నుంచి వస్తుందో తెలుసుకోకపోవడం బిగ్ డౌట్ క్రియేట్ చేస్తోంది. ఎక్సైజ్, టాస్క్ ఫోర్స్ వంటి పోలీస్ విభాగాలు బెల్లం విక్రయదారులపై నిఘా పెట్టి వారి నంబర్లను ట్రేస్ (డీఆర్ఫీ) చేసి పట్టుకోవటంలో విఫలమౌతున్నారన్న ఆరోపణలున్నాయి.

### పలు మండలాల్లో..

డోర్నకల్ నియోజకవర్గంలోని పలు మండలాలు అక్రమ బెల్లం వ్యాపారానికి అడ్డాగా మారాయి. డోర్నకల్, మరిపెడ, కురవి, సీరోల్ మండలాల పరిధిలోని దాదాపు 50 గ్రామాలకు క్వీంటాల కొద్ది బెల్లం, పటిక సరఫరా జరుగుతుండటంతో తండాలో సారా బట్టీలు పుట్టగొడుగుల్లా వెల్లుస్తున్నాయి. ముఖ్యంగా డోర్నకల్ మండంలోని మల్లాయికుండా తండా, మన్నెగూడెం, అందనాలపాడు, మొత్తుగడ తండా, చిల్కోయలపాడు, తోడెళ్లగూడెం, బోడ్రాయితండా, తెల్లబండ తండా తదితర ప్రాంతాల్లో సారా బట్టీలు అధిక సంఖ్యలో వెలిశాయి. ఆయా ప్రాంతాలలో సారా కేంద్రాలు కుటీర పరిశ్రమలుగా ఏర్పడ్డాయి. పట్టణ పరిధిలోని టంకుతండా, బంకట్ సింగ్ తండా, బుద్దారం తండాల్లో గుడుంబా జోరుగా విక్రయిస్తున్నారు. అధికారులు తూతూమంత్రంగా దాడులు చేసి వెళ్లిపోవడంతో బెల్లం అమ్మకాలు జోరుగా సాగుతున్నాయి. అమ్మోనియా, బెల్లం, పటికతోపాటు తంగేడి చెక్కలు, యూరియా వంటి ప్రమాదకరమైన వాటితో గుడుంబా తయారు చేస్తున్నారు. దీనిని తాగిన వారు రోగాల బారిన పడడంతో వారి కుటుంబాలు రోడ్డున పడుతున్న పరిస్థితి నెలకొంది.

### పక్క జిల్లాల నుంచి..

బెల్లం వ్యాపారులు గుడుంబా తయారీదారుల అవసరాన్ని క్యాష్ చేసుకుంటున్నారు. బెల్లం వ్యాపారులు గుడుంబా తయారీదారులు కుమ్మక్కై అక్రమ దందాలు కొనసాగిస్తున్నారు. వీరిని కట్టడి చేయాల్సిన ఎక్సైజ్ అధికారులు పోలీసుల నిర్లక్ష్యం కారణంగా పల్లెల్లో గుడుంబా ఏరులై పారుతోందన్న విమర్శలు వెలువెత్తుతున్నాయి. చిత్తూరు, అనకాపల్లి నుంచి లారీలు, డీసీఎంలలో బెల్లం, పటికను దిగుమతి చేసుకున్న వ్యాపారులు తయారీదారులకు విక్రయిస్తున్నారు. బహిరంగ మార్కెట్ లో 20 కిలోల బెల్లం బస్తా రూ.1,200 ఉండగా దానిని రూ.3 వేలకు విక్రయిస్తున్నట్లు తెలుస్తోంది. అదే విధంగా గుడుంబా లీటర్ రూ.100 ఉండంగా రూ.500 వరకు వికరిస్తూ మద్యం ప్రియుల జేబులకు చిల్లలు పెడుతున్నారు. మానుకోట సరిహద్దు గ్రామానికి చెందిన బెల్లం డాన్ సురేష్ పక్క జిల్లా సూర్యపేట నుంచి డీసీఎంల ద్వార పెద్ద ఎత్తున బెల్లాన్ని తీసుకొచ్చి బొలేర వాహాణాల ద్వారా ఏజెంట్ లకు సరఫరా చేస్తున్నాడని సమాచారం. గుడుంబా తయారీ దారుల నుంచి ఎన్ని బస్తాలు కావాలో ఇండెంట్ ముందే అందుకున్న ఏజెంట్లు ద్విచక్ర వాహనదారుల ద్వారా బస్తాలను వారికి అందిస్తున్నారు. ఉదయం 3 గంటల నుంచి గుడుంబా బట్టి ప్రారంభమై 7 గంటల వరకు గుడుంబా తయారైపోతుంది. ఇక్కడి నుంచి హోల్ సేల్, రిటైల్ రూపంలో తండాల్లోని విక్రయదారులకు అందుతుంది. కొంత మంది అధికారుల సహకారంతోనే ఈ చీకటీ వ్యాపారం మూడు పువ్వులు..ఆరు కాయలుగా నడుస్తోందనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. వీటిపై రాష్ట్ర పోలీస్ అధికారులు, ప్రభుత్వం దృష్టి సారించి ఈ రాకెట్ పై విచారణ జరిపించాలని, గ్రామాల్లో గుడుంబాను నిర్మూలించి పేదల కుటుంబాలు రోడ్డున పడకుండా చర్యలు తీసుకోవాలని బాధిత కుటుంబాలు వేడుకుంటున్నాయి.

# సిబ్బంది సమస్యలు పరిష్కరిస్తాం..

- కమిషనరేట్‌లో ప్రత్యేక విభాగం ఏర్పాటు
- వరంగల్ పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా

**వరంగల్ వాయిస్, క్రైం :** వరంగల్ పోలీస్ కమిషనరేట్ పరిధిలోని సిబ్బంది సమస్యల పరిష్కారానికి ప్రత్యేక విభాగాన్ని ఏర్పాటు చేస్తునట్లు వరంగల్ పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా తెలిపారు. ఇటీవలి కాలంలో వరంగల్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో విధులు నిర్వహిస్తున్న పోలీస్ సిబ్బంది పలు వ్యక్తిగత సమస్యలతో పాటు, శాఖపరమైన సమస్యలతో బాధపడుతున్నట్లు తన దృష్టికి వచ్చిందన్నారు. అందుకే వాటి పరిష్కారానికి వరంగల్ పోలీస్ కమిషనరేట్ కార్యాలయములోని పోలీస్ కంట్రోల్ రూంలో ప్రత్యేక విభాగాన్ని ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. ఇందుకోసం కంట్రోల్ రూంకు చెందిన మహిళా ఏఎస్ఐ జ్యోతి ప్రియాంకను నోడల్ అధికారిగా నియమించామన్నారు. ఇకపై పోలీస్ సిబ్బంది తమ వ్యక్తిగత, శాఖపరమైన సమస్యలు ఉంటే నోడల్ అధికారి ఫోన్ నంబర్ 948685494 కు ఫిర్యాదు చేయాలని సూచించారు. ఈ విధంగా వచ్చిన ఫిర్యాదులను సదరు నోడల్ అధికారి పోలీస్ కమిషనర్ దృష్టికి తీసుకవెళ్లి సమస్య పరిష్కారానికి తగు చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. వ్యక్తిగత సమస్యలు, శాఖపరమైన సమస్యలు నేరుగా తనతో చెప్పుకునేందుకు ప్రతి శనివారం వారి అందుబాటులో ఉంటానన్నారు. అలాగే తనను కలిసేందుకు వచ్చే సిబ్బందికి స్టేషన్ అధికారులు తప్పని సరిగా అనుమతి మంజూరు చేయాల్సిందిగా వరంగల్ పోలీస్ కమిషనర్ అధికారులకు ఉత్తర్వులు జారీచేశారు.



# రెండో రోజు కళాశాలల బంద్

**వరంగల్ వాయిస్, హనుమకొండ :** తెలంగాణ ప్రైవేట్ డిగ్రీ, పీజీ కాలేజీల మేనేజ్ మెంట్ పిలుపు మేరకు కళాశాలకు రావాల్సిన మూడు సంవత్సరాల ఫీజు రీయంబర్స్ మెంట్ నిధులు విడుల చేయాలని కోరుతూ చేపట్టిన సంపూర్ణ బంద్ మంగళవారం రెండో రోజుకు చేరుకుంది. అయినప్పటికీ ప్రభుత్వం నుంచి ఎటువంటి స్పందన రాలేదని కాకతీయ డిగ్రీ, పీజీ కాలేజీల మేనేజ్ మెంట్ అసోసియేషన్ నాయకులు ఆరోపించారు. ప్రభుత్వ చర్యలను నిరసిస్తూ బుధవారం ఏకశిల పార్క్ వద్ద యాజమాన్యాలు, అద్యాపకులతో కలిసి పెద్ద ఎత్తున నిరసన దీక్ష చేపట్టి, అనంతరం హనుమకొండ జిల్లా కలెక్టరేట్ వరకు నిరసన ప్రదర్శన నిర్వహించి కలెక్టర్ కు వినతి పత్రం ఇవ్వనున్నట్లు ప్రకటించారు. ఈ కార్యక్రమానికి జిల్లా వ్యాప్తంగా ఉన్న ప్రైవేట్ డిగ్రీ, పీజీ కళాశాలల యాజమాన్యాలు తరలి వచ్చి విజయవంతం చేయాలని కోరారు.

# ఏడు రేషన్ షాపుల సీజ్

- డీలర్లపై క్రిమినల్ కేసులు
- ప్రజలకు మెరుగైన సేవలందించాలి
- జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారదా



**వరంగల్ వాయిస్, వరంగల్ :** ప్రజా పంపిణీ వ్యవస్థ ద్వారా ప్రజలకు మరింత మెరుగైన సేవలందించుటకు కృషి చేయాలనీ జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారదా సూచించారు. మంగళవారం వరంగల్ జిల్లా కలెక్టరేట్ సమావేశ మందిరంలో పౌర సరఫరాల శాఖ ఆధ్వర్యంలో జిల్లా కలెక్టర్ అధ్యక్షతన జిల్లా స్థాయి విజిలెన్స్ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ కమిటీ సమావేశంలో చర్చించిన అంశాలను తప్పక పాటించాలని కలెక్టర్ ఆదేశించారు. జిల్లాలోని 2,66,664 మంది లబ్ధిదారులకు 509 రేషన్ షాపులలో ద్వారా ప్రతి నెల నిత్యావసర వస్తువులు పంపిణీ చేస్తున్నట్లు సివిల్ సప్లైస్ జిల్లా మేనేజర్ తెలిపారు. జిల్లాలోని 919 అంగన్వాడి సెంటర్ల ద్వారా ఆరోగ్య లక్ష్మి పథకం కింద గర్భిణీలు, బాలింతలకు పౌష్టికాహారం అందిస్తున్నట్లు జిల్లా సంక్షేమ అధికారి వివరించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ ప్రజా పంపిణీ వ్యవస్థ ద్వారా జిల్లాలో ప్రజలకు, అంగన్ వాడీ కేంద్రాలు, ప్రభుత్వ పాఠశాలలు, సంక్షేమ వసతి గృహాలకు బియ్యం, నిత్యావసర సరుకులను పంపిణీ చేస్తున్నామన్నారు. ప్రభుత్వ ఆశయాలకు అనుగుణంగా ఆహార భద్రతా చట్టం ప్రకారం నాణ్యమైన బియ్యం, నిత్యావసర సరుకులు అందించేలా అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. ఫోర్టిఫైడ్ బియ్యం వినియోగం కారణంగా మహిళల్లో ముఖ్యంగా గర్భిణిలు, బాలింతలు, చిన్న పిల్లల్లో రక్తహీనత, పౌష్టికాహార లోపం అధిగమించవచ్చన్నారు. ప్రజాపంపిణీ వ్యవస్థ ద్వారా పంపిణీ చేస్తున్న ఫోర్టిఫైడ్ బియ్యం ప్రయోజనాలు ప్రజలకు తెలియజేసి, వాటిని వినియోగించేలా అవగాహన కలిగించాలన్నారు. ఎంఎల్ఎస్ పాయింట్ల వద్ద ఖచ్చితమైన తూకం ఉండేలా చూడాలన్నారు. థంబ్ వేసిన వెంటనే డీలర్లకు రేషన్ సరఫరా జరిగేలా చర్యలు తీసుకోవాలన్నారు. ప్రజలకు, అంగన్వాడీ కేంద్రాలు, ప్రభుత్వ పాఠశాలలు, సంక్షేమ వసతి గృహాలకు బియ్యం, నిత్యావసర సరుకుల పంపిణీ, వినియోగంపై పటిష్టమైన నిఘాతో తనిఖీలు చేయాలన్నారు. ఇందుకోసం పౌర సరఫరాలు, రెవిన్యూ, ఫుడ్ సేఫ్టీ, తూనికలు కొలతలు అధికారుల ప్రత్యేక టాస్క్ ఫోర్స్ బృందాలు అంగన్వాడీ కేంద్రాలు, ప్రభుత్వ పాఠశాలు, వసతి గృహాలలో ఆహారం నాణ్యతలు తరచూ తనిఖీలు చేయాలనీ కలెక్టర్ అధికారులను ఆదేశించారు. అవకతవకలకు పాల్పడిన ఏడుగురు రేషన్ డీలర్లుపై క్రిమినల్ కేసులు నమోదు చేయడంతో పాటు రేషన్ దుకాణాలను సీజ్ చేయడం జరిగిందని అన్నారు. విజిలెన్స్ కమిటీ సభ్యులు హాస్టళ్లు తనిఖీ చేసి మెనూ పాటిస్తున్నారా లేదా పరిశీలన చేయాలని కలెక్టర్ సూచించారు. ఈ సందర్భంగా కమిటీ సభ్యులు చేసిన సలహాలు, సూచనలు పరిగణలోకి తీసుకుంటామని కలెక్టర్ పేర్కొన్నారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ సంధ్యారాణి, జిల్లా పౌర సరఫరాల అధికారి ఉమారాణి , డీఆర్డిఓ కౌసల్యాదేవి, జడ్పీ సీఈఓ రామి రెడ్డి, జిల్లా సంక్షేమ అధికారి రాజమణి, జిల్లా పౌర సరఫరాల శాఖ డీఎం సంధ్యారాణి, జిల్లా ఎస్సీ అభివృద్ధి అధికారి భాగ్యలక్ష్మి, జిల్లా గిరిజన సంక్షేమ శాఖ అధికారి సౌజన్య, రేషన్ దుకాణ డీలర్ సంఘ కార్యదర్శి దామోదర్, ఉపాధ్యక్షులు రాంచంద్రు, తదితరులు పాల్గొన్నారు.

EDITED, PRINTED, PUBLISHED AND OWNED BY GADDAM KESHAVA MURTHY, PRINTED AT MANIKANTA GRAPHICS, H.NO.4-10-121, KUMARPALLY, HANAMKONDA, WARANGAL URBAN DISTRICT-506001, TELANGANA STATE, PUBLISHED AT H.NO. 4- 7-138/1, KUMARPALLY, HANAMKONDA, WARANGAL.-506001. WARANGAL URBAN DISTRICT, TELANGANA STATE.
EDITOR : GADDAM KESHAVA MURTHY. RNI NO: TELTEL/2021/80377, PHONE NO : 8008794162, MAIL ID : gaddamkeshavamurthy@gmail.com